
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5

గురువారం 6 మార్చి 2025



కొమ్మాలపాటిని ఎమ్మెల్సీ వరించేనా!

- అధిష్ఠానం పరిశీలనలో మాజీ ఎమ్మెల్యే పేరు
- ఆశావహుల్లో జంగా సహా మరికొందరు నేతలు

8

పంది కొక్కుల దాడిలో శిశువు మృతి

6

గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బియ్యంతో సరి



రేషన్‌లో కోతలే కోతలు

- కందిపప్పు సహా సరుకుల పంపిణీ బంద్
- ప్రభుత్వ తీరుపై కార్డుదారులు తీవ్ర అసంతృప్తి
- బహిరంగ మార్కెట్‌లో మండుతున్న కందిపప్పు, నూనెలు

రేషన్ అంటే.. బియ్యంతో సరిపెడుతున్నారు. గతంలో కందిపప్పు, జొన్నలు, రాగులు, గోధుమ పిండితో పాటు బహిరంగ మార్కెట్‌లో ఆకాశాన్నంటేలా ఉండే నిత్యావసరాలను సబ్సిడీపై సరఫరా చేసేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ వ్యవస్థలో విపరీత మార్పులు తేవడంతో పాటు సరుకుల్లో కోతలు పెట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలుత గత టీడీపీ హయాంలో ఇచ్చినట్లుగా సరుకులను కార్డుదారులకు అందించారు. ఆ తర్వాత యథావిధిగా రేషన్ అంటే ఒక్క బియ్యం అన్నట్లుగా మార్చేశారు. పంచదార ఇస్తున్నా అది అందరికీ అందడం గగనమవుతోంది.



గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఏ నెలకానెల రేషన్ సరుకుల్లో మార్పులు తెస్తామని చెప్తున్నా అది ప్రకటనలకే పరిమితమవుతోంది. రేషన్ సరుకుల్లో కోత విధిస్తూ వస్తున్న ప్రభుత్వం ఈ నెల కూడా బియ్యం.. పంచదారకే పరిమితం చేసింది. కార్డుదారులకు వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన రాయితీ కందిపప్పు సరఫరాను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించినా అది కొన్ని నెలలకే పరిమితమైంది. కందిపప్పు.. సరఫరా పూర్తిగా నిలిపేయడంపై కార్డుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రేషన్‌లో సరుకుల కోతతో పేదలు ఇక్కట్లు పడుతున్నారు. ప్రభుత్వం గతంలో రాయితీపై కందిపప్పు కిలో రూ.67కు ఇచ్చేది. ఈ క్రమంలో రాయితీపై పంపిణీ చేయాలని కోరుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదని కార్డుదారులు విమర్శిస్తున్నారు. కందిపప్పుతో పాటు నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో పేదలపై ఆర్థిక భారం పడుతుండటంతో వారు ఆవేదన చెందుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను దారుణంగా దెబ్బ తీసింది. పౌర సరఫరాల వ్యవస్థ మొత్తం గడిచిన ఐదేళ్లలో నిర్వీర్యమై పోయింది. కూటమి ప్రభుత్వం రాకతో పరిస్థితి మారుతుందని, గత టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, పామాయిల్, గోధుమ పిండి, రాగులు, శనగలు అందుతాయని నిరుపేదలు ఆశపడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలినాళ్లలో ఆ దిశగా కొన్ని ప్రయత్నాలు చేసినా అది మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. కంది పప్పు, రాగులు, జొన్నల నిల్వలు సరఫరా లేకపోవడంతో వాటి సరఫరాలో ఆటంకాలు తలెత్తుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. సరుకుల రవాణాలో తలెత్తిన సమస్యలను పరిష్కరించి, తక్షణ ప్రాతిపదికన కందిపప్పు, రాగులు, జొన్నలు, గోధుమ పిండి వంటి సరుకులు పంపిణీ చేయాల్సిన అవసరం ఉంది.

కందిపప్పు ధర రూ.180

బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.175 నుంచి రూ.180 వరకు ధర ఉంది. ప్రభుత్వం కార్డుదారులందరికీ ప్రతి నెల కందిపప్పు పంపిణీ చేయక పోవడంతో సామాన్యులు ఇంట్లో పప్పు ఉడకడంలేదు. బహిరంగ మార్కెట్‌లో ధర పెరగడంతో ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేసే కందిపప్పు కోసం కార్డుదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. మార్కెట్‌లో కందిపప్పు ధర పెరిగే సమయంలో గతంలో కార్డుదారులకు రేషన్ సరుకుల్లో, ఇతరులకు రైతుబజార్లలో సబ్సిడీపై సరఫరా చేయడాన్ని పౌరసరఫరాలశాఖ పూర్తిగా విస్మరించింది. కార్డుదారులు కొన్ని నెలలుగా కందిపప్పు అడిగితే ఎండీయూ వాహనదారులు రాలేదని సమాధానం ఇస్తున్నారు. నూనెల ధరలు సలసలా కాగుతున్న నేపథ్యంలో చౌక ధరల్లో పామాయిల్ అందించాల్సిన అవసరం ఉంది. నిత్యావసర ధరలు మండిపోతున్న తరుణంలో రేషన్ ద్వారా నిత్యావసర సరుకులు అందిస్తే పేదల ఆకలి తీరుతుంది.

రేషన్ సరఫరాపై అధికారుల నియంత్రణ

రోజుకు 150 కార్డులకే సరఫరా

రేషన్ కార్డుదారులకు కూటమి ప్రభుత్వంలోనూ కష్టాలు తప్పడంలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఎండీయూ వ్యవస్థతోనే ఇబ్బందులు పడుతున్న కార్డుదారులకు.. రేషన్ సరుకుల సరఫరాలో అధికారుల నియంత్రణ చర్యలు కొత్త కష్టాలు తెచ్చి పెట్టింది. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి జరగాల్సిన పంపిణీలో అధికారుల నిర్వాకంతో జాప్యం జరుగుతోంది. కొత్త కొత్త నిబంధనలను తెర మీదకు తెచ్చి రేషన్ పంపిణీలో జాప్యం చేస్తున్నారు. ఈ నెల రేషన్ పంపిణీలో పౌర సరఫరాల అధికారులు కొత్త నిబంధనను తెరపైకి తెచ్చారు. రేషన్ సరఫరా చేసే ఎండీయూ వాహనాలకు నియంత్రణ విధించారు. ఒక్కో ఎండీయూ రోజుకు 150 కార్డులకు మించి రేషన్ సరఫరా చేయకూడదని ఆదేశించారు. ఒక్కో ఎండీయూ వాహనం ఒక రోజులో సగటున 300 కార్డులకు రేషన్ సరఫరా చేస్తుంటుంది. అలాంటిది ఈ నెల నుంచి ఒక్కో ఎండీయూ రోజుకు 150 కార్డులకు మించి రేషన్ సరఫరా చేయకూడదని అధికారులు హుకుం జారీ చేశారు. దీంతో ఎండీయూ వాహనదారులు ఒక పూట సరుకులు సరఫరా చేసి రెండోపూట ఆపేస్తున్నారు. దీంతో ఎండీయూ వాహనాల కోసం ఎదురు చూసే రోజు కూలీలు, చిరు ఉద్యోగులు పనులు మానుకుని ఇంకో రోజుపాటు ఎదురు చూడాల్సి వస్తోంది.

వేసవి దృష్ట్యా నిబంధన

వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని రేషన్ సరఫరాను పరిమితం చేశాం. ఉదయం 100 కార్డులు, సాయంత్రం 100 కార్డులకు రేషన్ సరుకులు పంపిణీ చేయాలని ఎండీయూ వాహనదారులకు సూచించాం. కార్డుదారులు ఎండలో నించుని ఇబ్బందులు పడకూడదని ఈ నిర్ణయం తీసుకున్నాం. రోజుకు 200 చొప్పున ఇచ్చినా 17 రోజుల్లో రేషన్ పంపిణీ చేయడం పూర్తవుతుంది. జాప్యమేమీ ఉండదు.

- కోమలి పద్మ, డీఎస్‌వో

అరకొరగానే సరఫరా..

గత నెలలో పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు అరకొరగానే కందిపప్పు సరఫరా అయింది. ఈ నెలలో కందిపప్పు, జొన్నలను పూర్తిగా నిలిపేశారు. పల్నాడు జిల్లాలో 6,34,893 తెల్ల కార్డులు ఉండగా ఈ నెలలో 3.62 శాతం కార్డుదారులకు మాత్రమే కందిపప్పు సరఫరా చేసినట్లు పౌరసరఫరాల శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. బాపట్ల జిల్లాలో 4,76,529 తెల్ల కార్డులకు 1.07 శాతం, గుంటూరు జిల్లాలో 5,89531 కార్డులకు 1.43 శాతం కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేశారు.

గుంటూరు.. ఎగుమతుల హబ్



- డీఈహెచ్ స్కీంకి ఎంపిక చేసిన కేంద్రం
- ఇక ఉమ్మడి జిల్లాలో ఉత్పత్తులు, ఎగుమతుల పెంపు
- మిర్చి, పసుపు, పత్తినూలు రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణ
- బాపట్లలో గ్రానైట్, రొయ్యల ప్రాసెసింగ్ ఉత్పత్తులకు ఊతం
- పల్నాడు ప్రాంతం నుంచి టెక్స్‌టైల్స్, సుగంధ ద్రవ్యాల ఎగుమతి

గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మిర్చి, పసుపు, పత్తినూలు ఉత్పత్తిలో ఉమ్మడి గుంటూరు జిల్లా రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా దేశ వ్యాప్తంగా పేరుగాంచింది. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన జిల్లా ఎగుమతుల హబ్ (డీఈహెచ్) పథకానికి ఉమ్మడి గుంటూరు జిల్లాను ఎంపిక చేసింది. రాష్ట్రంలో మూడు ఉమ్మడి జిల్లాలను ఈ పథకం కింద ఎంపిక చేయగా ఉమ్మడి గుంటూరుకు కూడా ఇందులో చోటుదక్కించుకున్నది. ఈ స్కీమ్‌తో ఆయా రంగాల్లో ఉత్పత్తుల పెరుగుదలతో పాటు పెట్టుబడులను ఆకర్షించే చర్యలకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుంది. ఆయా ఉత్పత్తులు, ఎగుమతులను గణనీయంగా పెంచే వాతావరణాన్ని కల్పిస్తారు. టెక్నాలజీ వినియోగానికి ఎకో సిస్టమ్‌ని కూడా అమలు చేసి ఎగుమతిదారుల మధ్య పోటీ తీసుకువస్తారు. దీంతో ఎగుమతి దారులకు వివిధ దశలలో లావాదేవీల ఖర్చు తగ్గనుంది. అలానే ఉపాధి కల్పనకు ఉపయోగపడుతుంది. డీఈహెచ్ స్కీమ్‌ని ఇటీవలే ఒక జిల్లా ఒక ఉత్పత్తి(ఓడీఓపీ) కార్యక్రమంతో సమ్మిళితం చేసింది. ప్రధానంగా సప్లై చైన్ సిస్టమ్‌లో ఉన్న ఆటంకాలను గుర్తించి జిల్లా ఎగుమతుల ప్రణాళికలో చర్చించి పరిష్కరిస్తారు. 2030 నాటికి ఎగుమతుల్లో రెండు ట్రిలియన్ల యూఎస్ డాలర్ల లక్ష్యాన్ని అధిగమించేందుకు ఈ డీఈహెచ్ పని చేస్తుంది. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో హెక్టార్ మిర్చి సాగు చేస్తే 6.25 మెట్రిక్‌టన్నుల దిగుబడి వస్తుంది. అదే బాపట్లలో 6.20, పల్నాడులో 6.25 ఎంటీల దిగుబడి లభిస్తుంది. గతంలో గోనె సంచుల్లో పత్తినూలు, మిర్చి, పసుపు నింపి ఎగుమతి చేసేవారు. అయితే ఇటీవల కాలంలో దిగుమతి చేసుకుంటున్న దేశాల్లోని కంపెనీల సూచనల మేరకు ప్యాకింగ్స్‌లో మార్పులు చేశారు. ప్యాకింగ్, బ్రాండింగ్‌లో ఇంకా మార్పులు జరగాల్సి ఉన్నది. కాగా బాపట్ల జిల్లాలో రొయ్యలను ప్రాసెసింగ్ చేసి తయారు చేసే ఉత్పత్తులు, గ్రానైట్, ప్రత్తి నూలు, ఎసెన్షియల్ ఆయిల్స్, పల్నాడు జిల్లా నుంచి సుగంధద్రవ్యాలు, టెక్స్‌టైల్స్‌ని ఎగుమతులకు గుర్తించారు. ఈ నేపథ్యంలో త్వరలోనే ఉమ్మడి గుంటూరు జిల్లా ఒక ఎగుమతుల హబ్‌గా మారుతుందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

ఈ-కామర్స్, డిజిటల్ మార్కెటింగ్

అంతర్జాతీయంగా ఇక్కడి ఉత్పత్తులకు ఈ-కామర్స్ డిజిటల్ మార్కెటింగ్ విధానాల ద్వారా డిమాండ్ ఏర్పడేలా చేస్తుంది. కిందిస్థాయిలో ఎగుమతుల ప్రోత్సాహం, ఉత్పాదకత, ఉద్యోగాల కల్పన లక్ష్యంగా చేసుకుని కేంద్ర వాణిజ్య శాఖకు సంబంధించిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ సంస్థ డీఈహెచ్‌ను ప్రవేశపెట్టింది. ఇప్పటికే డీజీఎఫ్‌టీ అమేజాన్ ఇండియా, షిప్ రాకెట్, డీహెచ్‌ఎల్ వంటి సంస్థలో ఒప్పందాలు కుదుర్చుకున్నది. స్థానిక ఎగుమతిదారులకు మద్దతివ్వడం, ఈ-కామర్స్ ఎగుమతులను ప్రమోట్ చేయడం, ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్‌పై వ్యక్తిగత సామర్థ్యం పెంచడం కోసం ఎంఎస్ఎంఈలకు వర్క్‌షాపులను నిర్వహిస్తున్నది.



మున్సిపాలిటీలకు ఆర్థిక స్వేచ్ఛ

- ఆరేళ్ల తర్వాత ఆర్థిక కష్టాలకు చెక్
- ఇక నుంచి బిల్లుల చెల్లింపులకు అవకాశం
- పట్టణాల్లో అభివృద్ధి పనులకు సానుకూల పరిస్థితి

సత్తెనపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా పరిపుష్టంగా ఉన్నా నిధులు వినియోగించుకునే అవకాశం లేక ఇంతకాలం మున్సిపాలిటీలు ఇబ్బందులు పడుతుండేవి. నిధులు ఉన్నా బిల్లులు చెల్లింపులు చేసుకోలేక.. ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూపులతో ఉండాల్సి వచ్చేది. మున్సిపాలిటీల్లో పనులు అంటే కాంట్రాక్టర్లు పారిపోయేవారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక ఇలాంటి కష్టాలకు చెక్ పడేలా కూటమి ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో మున్సిపాలిటీలకు ఆర్థిక స్వేచ్ఛ లభించింది. ఇక నుంచి ప్రభుత్వ అనుమతితో సంబంధం లేకుండా నిధులను వినియోగించుకునే అవకాశం మున్సిపాలిటీలకు ప్రభుత్వం ఇచ్చింది. దీంతో ఆరేళ్ల కష్టాలకు చెక్ పడినట్లుగా మున్సిపల్ పాలకవర్గాలు, అధికారులు భావిస్తున్నారు. 2018కి ముందు మున్సిపాలిటీల నుంచే నేరుగా బిల్లులు చెల్లింపులు జరిగేవి. దీంతో ఎక్కడికక్కడ మున్సిపాలిటీల వారీగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు జరిగేవి. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టనప్పటి నుంచి ఈ విధానాన్ని పూర్తిగా మార్చేసింది. దీంతో అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్న చందంగా ఉన్న మున్సిపాలిటీల పరిస్థితి మారింది. ఆర్థిక పుష్టి ఉన్నప్పటికీ నిధులు ఖర్చు చేసుకునే అవకాశం లేక పురపాలక సంఘాలు అల్లాడిపోయేవి. కనీసం వెయ్యి రూపాయలు ఖర్చు చేసినా సంబంధిత బిల్లు వెంటనే చెల్లించే అవకాశం లేకుండా పోయింది. మున్సిపాలిటీలకు సంబంధించి 001, 002 ఆర్థిక సంఘం నిధులు, పద్దులు ఉంటాయి. వీటి ద్వారా వచ్చే నిధులను మున్సిపాలిటీలు ఖర్చు చేసుకుంటాయి. అయితే ఈ పద్దుల అజమాయిషి ప్రభుత్వం చేతుల్లో ఇప్పటి వరకు ఉంది. అందువల్ల రూపాయి ఖర్చు పెట్టినా సీఎఫ్ఎంఎస్ నుంచే తీసుకునే పరిస్థితి. అది కూడా ఎప్పుడు మంజూరు చేస్తారో అనేది కూడా ప్రశ్నార్థకమే. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకునే విధంగా మున్సిపాలిటీల నుంచే నిధులు చెల్లించే అవకాశం కల్పించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో మున్సిపల్ పట్టణాల్లో అభివృద్ధి పనులు పరుగులు పెట్టే అవకాశాలు ఉన్నాయి.



తెనాలి మున్సిపాలిటీ కార్యాలయం

సీఎఫ్ఎంఎస్‌తో కష్టాలే కష్టాలు

2019 చివరిలో అప్పటి వైసీపీ ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్ విధానం అమల్లోకి తీసుకువచ్చింది. మున్సిపాలిటీలకు సంబంధించిన నిధులు కూడా ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లాయి. మున్సిపాలిటీలు బిల్లులు చెల్లించాలంటే సీఎంఎఫ్‌లో నమోదు చేస్తే ఆర్థిక శాఖ ఆమోదం తెలపాలి. ఆ తర్వాతే నిధులు విడుదలయ్యేవి. దీంతో మున్సిపల్ పట్టణాల్లో అత్యవసర, ఇతర ఏ అభివృద్ధి పనులు చేసినా నిధులు మంజూరు కాని పరిస్థితి నెలకొంది. బిల్లులు మంజూరు కాక కాంట్రాక్టర్లు అల్లాడిపోయేవారు. సంబంధిత బిల్లుల చెల్లింపులపై సమాధానాలు చెప్పలేక అధికారులు కూడా నలిగిపోయారు. ఈ పరిస్థితుల్లో ఆరేళ్లుగా మున్సిపాలిటీల్లో పనులు అంటే కాంట్రాక్టర్లు పారి పోయే పరిస్థితి నెలకొంది. చాలా మున్సిపాలిటీల్లో కాంట్రాక్టర్లకు రూ.కోట్లలో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

వచ్చే నెల నుంచి అమలు..

సీఎఫ్ఎంఎస్ విధానానికి చెక్ చెప్తూ కూటమి ప్రభుత్వం మున్సిపాలిటీలు నేరుగా నిధులు వ్యయం చేసుకునే అవకాశం కల్పించింది. ఈ విధానం ఏప్రిల్ నుంచి అమల్లోకి రానుంది. అయితే నిధుల ఖర్చుకు సంబంధించి గతంలో నిబంధనలే అమలు చేస్తారా?, కొత్తగా ఏమైనా మార్పులు చేస్తారా? అనేది ఇంకా స్పష్టం కాలేదు. కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు చేసేందుకు ముందుకు వచ్చే అవకాశంతో పాటు ఏదైనా అత్యవసర పనులను వెంటనే చేపట్టే అవకాశం మున్సిపాలిటీలకు వచ్చింది. కూటమి ప్రభుత్వం నిర్ణయం పట్టణాభివృద్ధికి దోహద పడుతుందని పలువురు కాంట్రాక్టర్లు తెలిపారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో దాదాపు ఆరేళ్లు మున్సిపాలిటీలు ఆర్థిక చెల్లింపుల్లో పడుతున్న ఇబ్బందులు తొలిగిపోయినట్లే.

మద్యం షాపులకు నేడు లాటరీ

గుంటూరు కార్పొరేషన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గీత కార్మిక కులాలకు జిల్లాలో కేటాయించిన 13 మద్యం షాపులకు గురువారం లాటరీ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి అరుణకుమారి తెలిపారు. కలెక్టరేట్‌లోని శంకరన్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ నాగలక్ష్మి లాటరీ ప్రక్రియ చేపడతారన్నారు. దరఖాస్తుల పక్రియ ఫిబ్రవరి 8 నాటికే ఓ కొలిక్కి వచ్చింది. లాటరీ జరిపి షాపులు కేటాయించాల్సి ఉండగా ఎమ్మెల్సీ కోడ్ అమల్లోకి రావడంతో ప్రక్రియను అధికారులు నిలిపివేశారు. అయితే ఎన్నికల ఫలితాలు తాజాగా వెల్లడికావడంతో కోడ్‌ను ఎత్తి వేస్తున్నట్లు మంగళవారం ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి విదితమే. దీంతో గతంలో నిలిచిపోయిన లాటరీ ప్రక్రియను మళ్లీ ప్రారంభించడానికి ఎక్సైజ్‌శాఖ సమాయత్త మైంది. జిల్లావ్యాప్తంగా 13 మద్యం దుకాణాలకు లాటరీ ప్రక్రియ గురువారం జరిపి గీత కార్మికులకు మద్యం షాపులను కేటాయించేందుకు ఎక్సైజ్ శాఖ ఏర్పాట్లు చేసింది.


పెండ్లి కుమారుడిగా నృసింహుడు

మంగళగిరి సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి పెండ్లి కుమారుడయ్యారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడుతూ అర్చకులు దిగువ సన్నిధిలోని నృసింహస్వామి, శ్రీదేవీ, భూదేవీ అమ్మవార్ల ఉత్సవమూర్తులను బుధవరం ఉదయం పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. అంతకుముందు సంప్రదాయంగా వస్తున్న ఆనవాయితీని అనుసరించి మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం తరఫున ఆ సంఘ ప్రతినిధులు మంగళ వాయిద్యాలతో స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. అనంతరం గర్భాలయంలో పెండ్లి కుమారుడి ఉత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఉత్సవ మూర్తులకు పంచామృత స్నపనతో అర్చకులు మంగళ స్నానాలు చేయించారు. ఆ తర్వాత పట్టువస్త్రాలతో నృసింహస్వామిని అలంకరించారు. పెండ్లి కుమారుని శోభలో వెలిగిపోతున్న నృసింహుడిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మాల్యవంతం శ్రీనివాసదీక్షితులు, కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, పద్మశాలీయ బహూత్తమ సంఘ ప్రతినిధులు గుత్తికొండ ధనుంజయరావు, రామనాథం పూర్ణచంద్రరావు, చింతక్రింది కనకయ్య, దామర్ల కుబేరస్వామి, మునగపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6.21 (గురువారం)

సహరి : 5.05 (శుక్రవారం)



శ్రీనృసింహస్వామి, శ్రీదేవీ, భూదేవీ అమ్మవార్లు

నృసింహుని గ్రామోత్సవం

పెండ్లి కుమారుడైన శ్రీలక్ష్మీనృసింహస్వామి ఉభయ దేవేరులతో కలిసి బుధవారం రాత్రి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. దేవస్థానం నుంచి మెయిన్ బజారు మీదగా మిద్దె సెంటరు వరకు చేరుకుని తిరిగి అదే మార్గంలో ఆలయానికి గ్రామోత్సవం విచ్చేసింది. దారిపొడవునా భక్తులు స్వామివారికి టెంకాయలు సమర్పించారు. సాంస్కృతి కార్యక్రమాలు, దేవతామూర్తుల వేషధారణలు భక్తులను విశేషంగా అలరించాయి.

అమరావతిలో ప్రపంచ బ్యాంకు బృందం

తుళ్లూరు, విజయవాడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో నిపుణులతో కూడిన ప్రపంచ బ్యాంకు బృందం బుధవారం పర్యటించింది. రాజధాని అమరావతి నిర్మాణంలో నిర్దేశించిన కార్యక్రమాల అమలు, వాటి నిర్వహణ, గ్రామాల్లో నీటి నిర్వహణ ప్రాజెక్టులు, పర్యావరణ, సామాజిక రక్షణ కార్యకలాపాలపై ఏపీ సీఆర్డీఏ అధికారులతో ప్రపంచ బ్యాంక్ బృందం చర్చించింది. సీఆర్డీఏ అధికారులతో కలిసి రాజధాని గ్రామాల్లో పర్యటించింది. ఈ బృందంలో కో-టాస్క్ టీం లీడర్ గెరాల్డ్ ఒలీవర్, అర్బన్ స్పెషలిస్ట్ కిన్‌గ్విన్ షెన్, ప్రొక్యూర్‌మెంట్ స్పెషలిస్టులు వేదమూర్తి, రాకేశ్, వాటర్ శానిటేషన్ కార్యాకలాపాల స్పెషలిస్ట్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



అమరావతిలో పర్యటిస్తున్న ప్రపంచ బ్యాంక్ బృందం సభ్యులు

పీఎంసీల కోసం సీఆర్‌డీఏ, ఏడీసీఎల్‌ల టెండర్లు

అమరావతి రాజధాని ప్రాంతంలో లెజిస్లేటివ్ అసెంబ్లీ భవనం (బీ+జీ+3), హైకోర్టు బిల్డింగ్ (బీ+జీ+7) నిర్మాణాల కోసం ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ (పీఎంసీ) నియామకం కోసం సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. అమరావతిలోని గవర్నమెంట్ కాంప్లెక్స్ ఏరియాలో టెండర్లు, పనుల పర్యవేక్షణ వ్యవహారాలన్నీ ఎంపిక చేసిన పీఎంసీ పరిధిలోనే జరగనున్నాయి. అలాగే రాజధాని ప్రాంతంలో క్లైమేట్ చేంజ్ యాక్షన్ ప్లాన్ రూపకల్పన, అమలు కోసం మరో పీఎంసీ కోసం సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. శాశ్వత ప్రాతిపదికన నిర్మించే ఇంటిగ్రేటెడ్ సెక్రటేరియట్, ప్రభుత్వ విభాగాధిపతుల ఆఫీసు బిల్డింగ్స్‌కు సంబంధించి కూడా పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించేందుకు సీఆర్‌డీఏ పీఎంసీ కోసం టెండర్లు పిలిచింది. రాజధాని ప్రాంతంలో మేజర్ ఆర్టీరియల్ రోడ్ల నిర్మాణానికి సంబంధించి ఎలివేటెడ్ కారిడార్ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ, పనుల పర్యవేక్షణకు సంబంధించి పీఎంసీ కోసం అమరావతి రాజధాని అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) టెండర్లు పిలిచింది.

నేటి నుంచి గుడారాల పండుగ

- దయాక్షేత్రానికి వేలాదిగా తరలివచ్చిన విశ్వాసులు
- లేమల్లె ప్రాంగణంలో హోసన్న మందిరం ప్రారంభం

8





- హోసన్న మందిరం ప్రారంభిస్తున్న పాస్టర్ మోహన్ సీ లాజరస్, జాషువా మోజెస్, అబ్రహం, జాన్‌వెస్లీ ఇతర దైవజనులు , హాజరైన భక్తులు

పందికొక్కుల దాడిలో శిశువు మృతి



మృతి చెందిన బాలుడు

నూజెండ్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పందికొక్కుల దాడిలో మూడు నెలల పసికందు మృతి చెందిన సంఘటన మండలంలోని రవ్వవరం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఐసీడీఎస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాయని కొండ గురవయ్య, దుర్గమ్మ ఊరు బయట గుడారంలో నివశిస్తూ గాజులు అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. వీరికి అప్పటికే మూడు సంవత్సరాల పాప ఉండగా, మూడు నెలల క్రితం మూడు రోజుల దివ్యాంగుడైన పసి బాలుడిని తీసుకొని వచ్చి పెంచుకుంటూ కౌషిక్‌గా పేరు పెట్టారు. బుధవారం ఉదయం తమ కుమార్తె దుకాణం వద్దకు వెళ్లేందుకు ఏడుస్తుండటంతో బాలుడిని ఇంట్లో పండుకొన బెట్టి కుమార్తెను తీసుకొని దుర్గమ్మ దుకాణానికి వెళ్లింది. తిరిగి వచ్చేలోగా ఇంటిలో నేలపై పండుకున్న కౌషిక్‌ను పందికొక్కులు తీవ్రంగా గాయపర్చాయి. బాలుడు ఏడుస్తుండటంతో తీవ్ర గాయాలైన కౌషిక్‌ను తీసుకొని దుర్గమ్మ గ్రామంలోని వైద్యునికి చూపించగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. సంఘటనా స్థలాన్ని ఐసీడీఎస్ సూపర్ వైజర్ విన్యానమ్మ, అంగన్, వైద్య సిబ్బంది పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. కౌషిక్ వివరాలు అంగన్ వాడీ కేంద్రాల్లో నమోదై ఉండక పోవటం, ఆషా కార్యకర్త వద్ద మాత్రమే నమోదై ఉన్నాయని వారు తెలిపారు. సరైన నివాస వసతి లేక పోవటం వల్ల బాలుడు పది కొక్కులకు బలయ్యాడని గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. తమకు మగ బిడ్డ లేడని తీసుకువచ్చి పెంచుకోవటం కూడా గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఐనవోలు ఎస్ఐ బి.వి.కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తవ్వకాల్లో పురాతన విగ్రహాలు లభ్యం



తవ్వకాలలో బయటపడ్డ సుమారు 700 ఏళ్ల నాటి విగ్రహాలు

ముప్పాళ్ళ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ముప్పాళ్ళలో ముస్లిం ఏరియాలో శివాలయానికి, మసీదుకు సమీపంలో అతి పురాతన కాలం నాటి పడగవిప్పిన నాగేంద్ర స్వామి విగ్రహం, గొల్లబామ విగ్రహం తవ్వకాలలో బయటపడ్డాయి. గ్రామానికి చెందిన వారు జేసీబీతో తవ్వడంతో సుమారు 10 అడుగుల లోతులలో బయట పడ్డాయని గ్రామస్తులు బుధవారం తెలిపారు. గతంలో అదే ప్రాంతంలో వినాయకుని విగ్రహం బయట పడటంతో విగ్రహాన్ని వేణుగోపాల స్వామి వారి ఆలయంలో ప్రతిష్ఠించారు. ప్రస్తుతం లభించిన చోళ కాలం విగ్రహాలుగా గుర్తించామని, శాస్త్రోక్తంగా పూజలు చేసి విగ్రహాలను గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయంలో పునఃప్రతిష్ఠింపజేస్తామని గ్రామ ప్రధాన అర్చకులు నారాయణం శ్రీనివాసమూర్తి తెలిపారు. పురాతన విగ్రహాలను పురావస్తు శాఖ అధికారుల పరిశీలన అనంతరం దేవదాయశాఖ పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా విగ్రహాలను ఆలయానికి తరలించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం.భవాని శంకర్ తెలిపారు.

ది గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్, గుంటూరు
రిజిస్టర్ నెం.ఐ-908

మహాజన సభ సమావేశపు నోటీసు

ది గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ గుంటూరు వారి మహాజన సభ సమావేశము ది. 27/03/2025 గురువారము మధ్యాహ్నం 2.30 గం.లకు గుంటూరులోని మెడికల్ కాలేజి రోడ్డు, కన్నా వారితోట, సంఘ ప్రధాన కార్యాలయము నందు జరుగును గాన సంఘ మహాజన సభ సభ్యులందరు హాజరు కావలసినదిగా కోరడమైనది. ఎజెండా అంశములు సభ్యులకు విడిగా పంపించబడును.

స్థలము : గుంటూరు
తేది : 05-03-2025
అన్ని సభ్య సంఘములకు సం/- బిజినెస్ మేనేజర్



ఉద్యోగావకాశాలు

➡ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు 10th పాస్, 50 సం॥పై వయస్సు వారు కావలెను. సంప్ర॥ 70367 61665.
AJG-210390

➡ వంట మీద ఆసక్తి కలిగిన మగవారు కావలెను. వయస్సు : 18-21 లోపల Contact : Pany's Kitchen LVR Club ప్రక్క రోడ్‌లో గుంటూరు. సెల్ : 9848214148.
AJG-210388

➡ హ్యాపీ హెల్త్‌కేర్, గుంటూరు వారితోట 7వ లైను, పేషెంట్, బెడ్‌పేషెంట్ అటెండర్స్, వంట మనిషి, ఆయాలు మరియు అనుభవం గల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, సెక్యూరిటి గార్డ్స్ కావలెను, సంప్ర॥ 9492672877.
AJG-210472

FLAT FOR SALE

➡ గుంటూరు సిటీలోని ఇన్నర్ రింగ్ రోడ్డులో YSR బొమ్మ దగ్గర 3000 Sq.f. తో అన్ని వసతులతో అపార్ట్‌మెంట్‌లో డ్యూప్లేక్స్ ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్ర॥ 9394113848.
AJG-210389

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును

➡ బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999
AJB-209310

అద్దెకు

➡ తెనాలి చెంచుపేట అమరావతి ప్లాట్స్‌లో ఇండివిడ్యూవల్ హౌస్, గ్రౌండ్ ఫ్లోర్, 1st ఫ్లోర్, డబల్ బెడ్ రూమ్ ఫ్లాట్ అద్దెకి ఇవ్వబడును. సంప్ర॥ 9490573469.
AJG-210215

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు
ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం :
ఉ॥ 10:00 గం॥ల నుండి
సా॥ 06:00 గం॥ల వరకు
(సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న **ఆంధ్రజ్యోతి**కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

గుంటూరు 1 టౌన్	- 97036 18725
గుంటూరు 2 టౌన్	- 99854 01056
తెనాలి	- 99854 11202
నరసరావుపేట	- 99854 11206
బాపట్ల	- 99663 35084
పిడుగురాళ్ళ	- 93909 05725
మంగళగిరి	- 93986 73618
అమరావతి	- 95027 86195
పొన్నూరు	- 97042 99094
రేపల్లె	- 99854 12254
చిలకలూరిపేట	- 98852 71281
వినుకొండ	- 99662 50266
మాచర్ల	- 88861 19952
సత్తెనపల్లి	- 91103 23914
ప్రత్తిపాడు	- 63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

అందరికీ ఆమోదయోగ్యమైన కేంద్ర బడ్జెట్

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినిశర్మ



పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినిశర్మ

బాపట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల ప్రజలకు ఎంతో ఆమోదయోగ్యమైనదని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినిశర్మ పేర్కొన్నారు. బుధవారం బాపట్ల విచ్చేసిన ఆమె పార్టీ శ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్రంలో, బాపట్ల జిల్లాకు కేంద్రం అందించిన సహకారం గురించి వివరించారు. వందల కోట్ల రూపాయలతో కొరిశపాడు దగ్గర 4.1 కిలోమీటర్ల ఎమర్జెన్సీ ల్యాండింగ్ రోడ్డును నిర్మించినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితులలో సుకోయ్‌లాంటి యుద్ధ విమానాలు సైతం అక్కడ దిగవచ్చు అన్నారు. 14, 15 ఆర్థిక సంఘ నిధులు కూడా పంచాయతీలకు, మున్సిపాలిటిలకు అందాయన్నారు. రూ. 1064.24 కోట్లతో నూతనంగా 167ఎ జాతీయ రహదారి నిర్మాణంతో రవాణా వ్యవస్థ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ హైవేతో చీరాల నుంచి సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల ప్రోత్సాహంతోపాటుగా బాపట్ల-ఓడరేవు మధ్య బీచ్‌టూరిజం అభివృద్ధి చెందుతుందన్నారు. బాపట్ల-చుండూరు మధ్య 32 కిలో మీటర్లు రైలుమార్గం, బాపట్ల-సూరారెడ్డిపాలెం మధ్య 74 కిలో మీటర్ల రైలుమార్గం వేయటమే కాక బాపట్ల, చీరాల, రేపల్లె రైల్వేస్టేషన్‌లను అమృత్ స్టేషన్‌ల జాబితాలో చేర్చి కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఇవేకాకుండా జిల్లాలో నిజాంపట్నం ఆక్వాపార్క్ రూ. 300 కోట్లతో, ఫిషింగ్ హార్బర్ రూ. 438 కోట్లతో నిర్మించిందని ఆమె పేర్కొన్నారు. సాగరమాల ద్వారా ఈ సంవత్సరం రూ. 2243 కోట్లను రాష్ట్రానికి ఇచ్చినట్లు తెలిపారు. పీఎం మత్స్య సంపద కింద ఈ సంవత్సరం రాష్ట్రానికి రూ. 15 వేల కోట్లు కేటాయించారని ఆమె వివరించారు. ఇంకా మరెన్నో ప్రాజెక్ట్‌లకు కేంద్రం నిధులివ్వగా జిల్లాలో వాటి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. బడ్జెట్ గురించి దేశవ్యాప్తంగా జరుగుతున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా తాను వచ్చినట్లు తెలిపారు. వేతనజీవులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఆదాయ పన్ను మినహాయింపు రూ. 12లక్షల వరకు ఇవ్వటం ఎంతో మంది మధ్యతరగతి వేతనజీవులకు ఊరటనిస్తుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పోలవరం నిర్మాణం కోసం నిధులు, ప్రధానమంత్రి ఆవాసయోజన పథకం కింద రాష్ట్రానికి ఇళ్ల కేటాయింపులో అగ్రస్థానం ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధిపై నిబద్ధతకు నిదర్శనమన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు బ్రహ్మాండం బాలనారాయణ, రూరల్ అధ్యక్షుడు పేరి రెడ్డి, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు మిమిడి రమేష్‌కుమార్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, కరీముల్లా, బాబునాగేంద్ర పాల్గొన్నారు.

ప్రార్థన ద్వారా పరలోకం సిద్ధిస్తుంది

● గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య



మాట్లాడుతున్న బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య

ఫిరంగిపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మానవాళికి ప్రార్థన, ఉపవాసం, దాన ధర్మాలు చేయటం ద్వారానే మోక్ష ప్రాప్తి జరుగుతుందని గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు ఫిరంగిపురంలోని బాల ఏసు కథెడ్రల్ దేవాలయంలో విభూది బుధవారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన దివ్య పూజాబలిలో ఆయన మాట్లాడారు. క్రైస్తవులకు ప్రతి ఏడాది క్రీస్తు శ్రమల కాలం ప్రత్యేక దినాలుగా ఉంటాయన్నారు. ఈ 40 దినాలు ఉపవాస దీక్షలు చేస్తూ నిష్ఠతో నియమాలను పాటిస్తూ జీవించాలన్నారు. దీని ద్వారా ఈస్టర్ పండగకు సంసిద్ధులు కావాలన్నారు. క్రీస్తు శ్రమల కాలంలో క్రైస్తవులు మూడు ఆయుధాలు కలిగి ఉండాలన్నారు. ప్రార్థన, ఉపవాసం, దాన ధర్మాలు చేస్తూ జీవించాలన్నారు. క్రీస్తు శ్రమలను అత్యంత ప్రవిత్రంగా ధ్యానించాలని ఆయన తెలిపారు ఈ సందర్భంగా 450 మంది క్రైస్తవులు జపమాలను ధరించి ప్రత్యేక దీక్షలు చేపట్టారు. పూజాబలిలో దివ్య సత్ప్రసాదాన్ని బిషప్ భాగ్యయ్య భక్తులకు పంపిణీ చేశారు. పూజలో బాల ఏసు చర్చి ఫాదర్ ఎం పాతిమా మర్రెడ్డి, ఫాదర్ ప్రవీణ్, ఫాదర్ రవీంద్ర, ఫాదర్ మద్దు బాలస్వామి, ఫాదర్ విలియమ్, గుడి పెద్దలు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ విజేతగా తెనాలి జేఎంజే



విజేతగా నిలిచిన జేఎంజే జట్టును అభినందిస్తున్న ఎంపిక కమిటీ సభ్యులు, ముఖ్యఅతిథులు

నరసరావుపేట టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో జరిగిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో విజేతగా తెనాలి జేఎంజే కళాశాల నిలచిందని కళాశాల ఛైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు బుధవారం తెలిపారు. ద్వితీయ స్థానంలో ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ సైన్స్ కళాశాల, మూడో స్థానంలో ఎంఏఎం ఫార్మసీ కళాశాల నిలిచాయి. ముఖ్యఅతిథులుగా హాజరైన చిలకలూరిపేట శ్రీనిఖిల టెక్నో స్కూల్ డైరెక్టర్ శిరీష, ఏఎన్‌యూ యోగా సెంటర్ కోఆర్డినేటర్ డి. సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఆటలో గెలుపు, ఓటములు సహజమన్నారు. కళాశాల డైరెక్టర్ దరువురి శ్రావ్య, టోర్నమెంట్ ఛైర్మన్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, పీడీ జె.శంకర్, కమిటీ సభ్యులు సీహెచ్ వెంకటరావు, జె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. కాగా ఎంఏఎం ఫార్మసీ విద్యార్థులు యు.అఖిల, షేక్ ఆఫ్రీన్ ఆల్ ఇండియా మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక అయ్యారని డైరెక్టర్ దరువురి శ్రావ్య తెలిపారు. మార్చి 29న కరైకుడిలోని అల్గాప్ప విశ్వవిద్యాలయంలో జరిగే అంతర విశ్వవిద్యాలయాల పోటీలలో ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

పెన్షన్ కోసం వర్సిటీ విశ్రాంత ఉద్యోగులు నిరసన



వీసీ చాంబర్‌లో కింద కూర్చొని నిరసన తెలియజేస్తున్న వర్సిటీ విశ్రాంత ఉద్యోగులు

పెదకాకాని, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నెలకి సంబంధించిన పెన్షన్లు విశ్రాంత అధ్యాపకులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్లు బుధవారం నిరసనకు దిగారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీసీ చాంబర్‌లో కింద కూర్చొని నిరసన తెలియజేశారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య విష్ణువర్ధన్, కార్యదర్శి శివప్రసాద్, విశ్రాంత ఉద్యోగి మల్లేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు బుధవారం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావును ఆయన చాంబర్లో కలిశారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెన్షనర్లు మాట్లాడుతూ ఫిబ్రవరి నెలకు సంబంధించిన జీతాలను యూనివర్సిటీ రెగ్యులర్ ఉద్యోగులకు యూనివర్సిటీ నిధుల నుంచే చెల్లించారని, అధ్యాపక సిబ్బందికి, విశ్రాంత అధ్యాపకేతర ఉద్యోగులకు కూడా ఫిబ్రవరి నెలకు సంబంధించిన పెన్షన్లు యూనివర్సిటీ నిధుల నుంచే చెల్లించారని, కానీ యూనివర్సిటీలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన రెగ్యులర్ అధ్యాపకులకు మాత్రం నిధులు లేవన్న సాకుతో పెన్షన్ నిలిపియడం సరికాదని వారు వీసీ దృష్టికి తీసుకువచ్చారు. డీఏ బకాయి కూడా వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు. తమ సమస్య పరిష్కరించే వరకు తాము నిరసన విరమించమని వీసీ చాంబర్లో నేలపై కూర్చున్నారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం పెన్షనర్లతో చర్చలు జరిపారు. సోమవారం నాటికి పెన్షన్లు చెల్లిస్తామని తెలిపారు. డీఏ బకాయి కూడా చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

అప్పు చెల్లించలేదని ఆత్మహత్యకు ప్రేరేపణ

● గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ మృతి

పిడుగురాళ్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు చెల్లించలేదని ఆ వ్యక్తిని ఆత్మహత్యకు ప్రేరేపించిన ఘటన రెండు రోజుల క్రితం పిడుగురాళ్లలో జరిగింది. పిడుగురాళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సత్తెనపల్లికి చెందిన ముప్పాళ్ల అంజిబాబు అదే పట్టణానికి చెందిన షేక్ మాబుసుభాని వద్ద రెండున్నర లక్షలు అప్పు తీసుకున్నాడు. వ్యక్తిగతంగా కొన్ని అప్పులు చేసి వాటిని తీర్చలేని పరిస్థితిలో ఉన్నానని పరిచయస్తుడైన పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ మాస్టర్ రామారావు వద్ద పలుమార్లు వాపోయాడు. కొంతకాలంగా అప్పుల బాధ తప్పుకునేందుకు పిడుగురాళ్లకు వచ్చి స్టేషన్ మాస్టర్ అయిన రామారావు రైల్వే క్వార్టర్స్‌లో తలదాచుకుంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 3న అంజిబాబు పిడుగురాళ్లలో రైల్వేక్వార్టర్స్‌లో రామారావు వద్ద ఉన్నట్లు తెలుసుకున్న మాబుసుభాని మరికొంతమంది స్నేహితులతో కలిసి అంజిబాబు ఉంటున్న రైల్వే క్వార్టర్స్ వద్దకు వచ్చి మాట్లాడుకుందాం రమ్మని అంజిబాబుతో పాటు గవన్ కుమార్‌రెడ్డిని తీసుకొని కారులో హైవేపై ఉన్న ఖలీల్ దాబా ఎదురుగా ఉన్న ప్లాట్ల వద్దకు వెళ్లారు. అక్కడ అప్పు చెల్లించాలని అంజిబాబుతో మాబుసుభాని గొడవపడి ఇద్దరూ చేతులతో కొట్టుకున్నారు. బాకీ చెల్లించేందుకు అంజిబాబు కొందరిని ఫోన్‌లో డబ్బులు అడుగగా డబ్బులు లేవని తెలుపడంతో మనస్తాపానికి గురై ఖలీల్ దాబా వద్ద ఉన్న ప్లాట్ల నుంచి పిల్లుట్ల శివారులోని నాగేశ్వరపురంతండాలోని వ్యవసాయ పొలాల్లోకి వెళ్లారు. అక్కడ సాయంత్రం 7 గంటల వరకు బాకీ చెల్లించాలనే విషయంలో వాగ్వివాదం జరిగి బాకీ చెల్లించలేకపోతే చావమని రెచ్చగొట్టారు. గడ్డిముందు తెచ్చిస్తే తాగి చనిపోతానని అంజిబాబు తెలుపగా మాబుసుభాని తనతోపాటు వచ్చిన వ్యక్తులతో గడ్డిమందు డబ్బా కొనితెచ్చిచ్చారు. అంజిబాబు గడ్డిమందును మద్యంలో కలిపి తాగగా మాబుసుభానితోపాటు వచ్చిన మరికొందరు పారిపోగా అంజిబాబు పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు వచ్చి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స పొందుతూ గుంటూరులోని రమేష్ హస్పటల్‌లో మృతి చెందినట్లు సీఐ ఎస్ వెంకట్రావు తెలిపారు. గవన్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చైన్‌స్నాచింగ్ కేసుల్లో నిందితుడి అరెస్టు

● 120 గ్రాముల బంగారం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ కల్యాణ్‌రాజు

తాడేపల్లి టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఆరు నెలల్లో తాడేపల్లిలో జరిగిన వరుస చైన్‌స్నాచింగ్ కేసుల్లో నిందితుడిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నార్త్ జోన్ డీఎస్పీ మురళీ కృష్ణ, సీఐ కల్యాణ్‌రాజు వివరాలు వెల్లడించారు. సీఐ కల్యాణ్‌రాజు, ఎస్ఐ ఖాజావలి సిబ్బందితో కలిసి మూడు బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానంతో విశ్వసనీయ వర్గాల వారి సహకారంతో పక్కా సమాచారం సేకరించి నిందితుడిని గుర్తించారు. ఈ క్రమంలో తాడేపల్లి కనకదుర్గమ్మ వారధి వద్ద కాపుకాసి స్కూటీపై వెళుతున్న శీలం కమల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మంగళగిరికి చెందిన కమల్ పగటి వేళల్లో ఒంటరిగా వెళుతున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని మెడలో ఉన్న బంగారు చైన్లు దొంగతనం చేసి పారిపోతున్నట్టు అంగీకరించాడని డీఎస్పీ తెలిపారు. తాడేపల్లిలో నమోదైన మూడు కేసులకు సంబంధించి సుమారు రూ.10లక్షల విలువైన 120 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన సీఐ కల్యాణ్‌రాజు, ఎస్ఐ ఖాజావలి, సిబ్బంది సురేశ్, ప్రసాద్, పరమేష్‌లను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.

ఆలపాటికి నాని, పంచుమర్తి అభినందనలు





గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు- కృష్ణ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం పొందిన కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలిసి టీడీపీ గుంటూరు జిల్లా సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ వినుకొండ నియోజకవర్గ పరిశీలకులు పంచుమర్తి భూపతిరావు, కోవెలమూడి రవీంద్ర శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ సీనియర్ నాయకులు కసుకుర్తి హనుమంతరావు, పానకాల వెంకట మహాలక్ష్మి, ఉప్పుటూరి పేరయ్య, వినోద్, వెంకటేశ్వరరావు, నలబోతు శ్రీనివాసరావు, అడపా శివప్రసాద్ బాబు, పాములపాటి శ్రీనివాసరావు, వుల్లా సుందరం బాబు తదితరులు ఉన్నారు.

జగన్‌కు విమర్శించే అర్హత లేదు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలవడంతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను విమర్శించే అర్హత జగన్‌మోహన్‌రెడ్డికి లేదన్నారు. కార్పొరేటర్‌కు ఎక్కువ, ఎమ్మెల్యేకి తక్కువ అంటూ మాట్లాడటం తగదన్నారు. ఇలాంటి అహంకార మాటలకే 11 స్థానాలకు దిగజారారని అన్నారు. సొంత చెల్లి, తల్లి, కార్యకర్తలే అతన్ని నమ్మడం లేదన్నారు. ఎమ్మెల్సీ బ్యాలెట్ ఎన్నికలలో కూడా 67 శాతం ఓట్లు కూటమి అభ్యర్థులు ఆలపాటి రాజేంద్రప్రసాదు, రాజశేఖర్‌కు ప్రజలు వేశారన్నారు. ఈవీఎం, బ్యాలెట్ పద్ధతులలో ఏ ఎన్నికలైనా గెలుపు మాత్రం కూటమి పార్టీలదే అన్నారు. గత ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డి కంటే పవన్‌కల్యాణ్‌కు వచ్చిన మెజార్టీ, వైసీపీ, జనసేనకు వచ్చిన సీట్లు ఎన్నో జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచించుకోవాలన్నారు. మంచి ప్రవర్తనతో వ్యవహరిస్తే బాగుంటుందన్నారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సమయం చూసి ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు (విద్య), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తాడికొండలోని జనరల్, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయప్రకాశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ విద్యార్థినుల కోసం, జనరల్ బాలుర కోసం రెండు గురుకులాలు ఉన్నాయని తెలిపారు. ఆయా గురుకులాల్లో 5వ తరగతితోపాటు 6,7,8 తరగతుల్లో ప్రవేశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఈ నెల 31లోగా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం 8712625038లో లేదా https://aprs.ap.cfss.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

రొంపిచర్ల, మార్చి 5 (ఆంధ్రజోతి): మండలంలోని రెడ్డిపాలెంలో గల పీఎం ఏపీ మోడల్ పాఠశాలలో 2025-26 సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశించే విద్యార్థులు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు పి. హవీలా, డి.బ్రహ్మేశ్వరరావు బుధవారం తెలిపారు. పరీక్ష కోసం కనీస వయస్సు ఓసీ, బీసీ విద్యార్థులకు పది నుంచి 12 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 14 సంవత్సరాల వయస్సు ఉండాలన్నారు. 2024-25 సంవత్సరానికి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరవధికంగా 5వ తరగతి చదివి ప్రమోషన్ పొందిన వారై ఉండాలన్నారు. ఏప్రిల్ 20వ తేదీన పాఠశాల ఆవరణలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్షకు కనీస ఉత్తీర్ణత ఓసీ, బీసీ విద్యార్థులకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులని తెలిపారు. పరీక్షల్లో కనబరిచిన ప్రతిభా మార్కులు, రిజర్వేషన్ నియమాలను అనుసరించి ఎంపిక చేస్తామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

తెనాలి క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం పట్టణంలోని ఇస్లాంపేట పాలపర్తి వారి వీధిలో జరిగింది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెనాలి మున్సిపాలిటీలో దినసరి కూలీగా పని చేస్తున్న యర్రంశెట్టి సాయికల్యాణ్ (27)కు నాలుగు సంవత్సరాల క్రితం బాపట్లకు చెందిన దుర్గాభవానీతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు మగ పిల్లలు. ఇరు కుటుంబాలలో ఏర్పడిన చిన్నపాటి గొడవలు కారణంగా భార్య సంవత్సర క్రితం పుట్టింటికి వెళ్లింది. గత నెలలో తిరిగి కాపురానికి తెనాలి వచ్చింది. ఆ సమయంలో కూడా భర్త సరిగ్గా ప్రవర్తించకపోవడంతో తిరిగి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి బాపట్లలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కొద్దిరోజుల క్రితం బాపట్ల పోలీసులు సాయికళ్యాణ్‌కి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు. బుధవారం ఉదయం ఇంటిలో సాయికల్యాణ్ ఫ్యాన్‌కి చీరతో ఉరి వేసుకుని మరణించి ఉండటం తల్లిదండ్రులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు చేసుకుని విచారిస్తున్నట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ అదుపుతప్పి డ్రైవర్ మృతి

కారంపూడి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ అదుపుతప్పి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని నరమాలపాడు శివారులో బుధవారం జరిగింది. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం చింతలవూరు గ్రామానికి చెందిన తాడి సత్తిబాబు (40) వినుకొండ నుంచి తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేటకు సుబాబులు చెట్లు నరికేందుకు ట్రాక్టర్‌లో వెళ్తున్నాడు. మార్గమధ్యంలోని నరమాలపాడు శివారులో ట్రాక్టర్ అదుపుతప్పడంతో సత్తిబాబు ట్రాక్టర్ కింద పడిపోయాడు. ట్రాక్టర్ టైరు అతనిపైకి ఎక్కడంతో సత్తిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వాసు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 526.50 అడుగులు ఉంది. ఇది 161.39 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8718 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 18,821 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	98, 107, 118
చికెన్ విత్ స్కిన్	190.00
చికెన్ స్కిన్ లెస్	200.00

1,30,346 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,18,446 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,30,346 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 58,217 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	11500	13000
334	9500	13700	బ్యాడిగి 355	10500	13500
నంబరు. 5	10500	13500	సింజెంటా		
273	10000	13000	బ్యాడిగి 5531	10500	12500
341	10500	14600	ఎన్ఎస్ 250		
4884	10000	10700	బుల్లెట్	--	--
సూపర్ 10	--	--	దేవనూరు డీలక్స్	12500	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఆర్మూరు	10000	11500
తేజ	10500	14000	తాలుకాయలు	5000	7500

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్ర॥ 99854 11213 99854 11225 99854 01877 99854 04047 99854 01614

సీనియర్ డీవోఎం దినేష్‌కుమార్ రిలీవ్

గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రైల్వే గుంటూరు సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ ఎం దినేష్‌కుమార్ రిలీవ్ అయ్యారు. ఆయన్ని గతంలోనే విజయవాడ డివిజన్‌కు సీనియర్ డీవోఎం(జనరల్)గా బదిలీ అయ్యారు. అయితే ఆయన స్థానంలో ఇక్కడికి పోస్టింగ్ చేసిన త్రినాథ్ బాధ్యతలు చేపట్టకపోవడంతో దినేష్‌కుమార్ కొనసాగారు. త్రినాథ్ బుధవా రం బాధ్యతలు చేపట్టడంతో దినేష్‌కుమార్ రిలీవ్ అయ్యారు. దినేష్‌కుమార్‌ని రైల్వే డీఆర్‌ఎం ఎం రామకృష్ణ అభినందించారు. ఆయనకు రైల్వే అధికారులు, ఉద్యోగులు వీడ్కోలు పలికారు.

రైల్వే ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు

రైల్వే బోర్డు ఉత్తర్వుల మేరకు గుంటూరు డివిజన్‌లో గజిటెడ్‌తో సహా 447 కేసులు నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు కోసం గుర్తించినట్లు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. 2025 మార్చి 20వ తేదీ లోపు ఉన్న కేసుల్లో ఒక నోషనల్ ఇంక్రిమెంట్ జోడించడం ద్వారా పెన్షన్ సవరణ జరుగుతుందన్నారు. అలానే సంబంధిత నివాస చిరునామాకు పెన్షన్ చెల్లింపు ఆర్డర్‌లు పంపిస్తారన్నారు. గుంటూరు డివిజన్ పర్సనల్ బ్రాంచ్‌లో ఉద్యోగుల తాత్కాలిక జాబితా అప్‌లోడింగ్ చేశారన్నారు. సమాచారం కోసం సీనియర్ డీపీవో కార్యాలయంలో సంప్రదించాలని, 9701379605కు ఫోన్ చేసి తెలు సుకోవచ్చన్నారు.

10న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), మార్చి 5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో కార్పొరేట్ జోక్యాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 10న స్థానిక చుట్టగుంట, రాష్ట్ర కమిషన్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏఐకే ఎస్ జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా డీ2 సెక్షన్ నల్లచెరువు పరిధిలోని సంపత్‌నగర్, అడపా బజార్, పార్వతీపురం, నల్లచెరువు, జీరో లైను నుంచి 4వ లైను వరకు, ఎత్తు రోడ్డు, రామనామక్షేత్రం, పట్నంబజార్, నల్లచెరువు మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు, డిప్యూటీ ఈఈ రాజమోహన్, ఏఈ బి.శ్రీని వాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలానే గుజ్జన గుండ్ల, ఉద్యోగనగర్, ఎస్‌వీఎన్ కాలనీ, నేతాజీనగర్, తారకరామనగర్, మారుతీ నగర్, నాయీబ్రాహ్మణ కాలనీ, తురకపాలెం రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య మరో ప్రకటనలో పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంలో రాజీ లేదు : ఆతుకూరి

గుంటూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వ్యాపారుల సమస్యల పరిష్కారంలో ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ రాజీ లేని పోరాటం చేస్తుందని చాంబర్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు తెలిపారు. చాంబర్ ఉపాధ్యక్షుడు తడికమళ్ళ సూర్య ప్రకాశరావు గతనెల 21న కన్నుమూసిన నేపథ్యంలో ఆయన సంతాప సమావేశం బుధవారం జిన్నాటవర్ సెంటర్లోని చాంబర్ కార్యాలయంలో జరిగింది. సూర్యప్రకాశరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గార్లపాటి సత్యనారా యణ, టీఎల్‌వీ వీరాంజనేయులు, ఆతుకూరి నగేష్‌కుమార్, ఆతుకూరి వీరాంజనేయులు, వీఎస్‌హెచ్ అనీల్‌కుమార్, అనుబంధ సభ్యులు తదితరులున్నారు.

వేతన సవరణపై జ్యూడిషియల్ కమిటీని ఏర్పాటు చేయాలి

గుంటూరు(తూర్పు), మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు 2023 నుంచి రావాల్సిన 12వ వేతన సవరణపై జ్యూడిషియల్ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక మెడికల్ కళాశాల ఆవరణలోని సంఘ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని కోరారు. ఈఎస్‌ఐ ద్వారా నగదు రహిత చికిత్స అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 8న సంఘ కార్యాలయంలో జరిగే మహిళా దినోత్సవంలో మహిళా ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కరీముల్లా షాఖాదరి, నాగేశ్వరరావు, పెదరత్తయ్య, హేమలత, షబానా సుల్తానా, గౌరి తదితరులు పాల్గొన్నారు.

చిప్స్ కళాశాలలో ప్రాంగణ నియామకాలు

గుంటూరు(విద్య), మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని చిప్స్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఒమేగా హెల్త్ కేర్ (చెన్నై), మెడిటెక్ హైర్ (బెంగళూరు), వేదిక్ బిజినెస్ సొల్యూషన్స్ (బెంగళూరు) సంస్థలు పాల్గొన్నాయి. ఈ ప్రాంగణ నియామకాల్లో రాష్ట్రంలోని వివిధ ఫార్మసీ కళాశాలల నుంచి మొత్తం 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విద్యాధర తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారయత్నం చేసిన మైనర్ అరెస్టు

గుంటూరు మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారయత్నం చేసిన మైనర్‌ను కొత్తపేట పోలీసులు అరెస్టు చేశారు. నాలుగు రోజుల క్రితం బాలిక ఇంటి సమీపంలోని స్నేహితుల ఇంటికి వెళ్తుండగా మధ్యలో బాలుడు బాలికకు మాయ మాటలు చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేయడంతో పారిపోయాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. తాపీ పని చేసుకునే మైనర్ను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.





నడక దారులు, షాపుల ముందు పేరుకుపోయిన కూరగాయల వ్యర్థాలు

పేరుకే పెద్ద మార్కెట్.. అన్నీ చెత్తదిబ్బలే



← ఉండీ ఉపయోగం లేని బావి

అసలే ఇరుకైన నడక దారులు.. ఆపైన ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు... ఇటు వ్యాపారులకు, అటు వినియోగదారులకు కనీసం మూత్ర విసర్జనకు అవకాశం లేని దుస్థితి. ఇదీ స్థానిక కార్పొరేషన్ ఎదురుగా ఉన్న పెద్ద మార్కెట్‌లో పరిస్థితి. పేరుకు మాత్రమే పెద్ద మార్కెట్ కనీస సౌకర్యాలు లేని స్థితి అక్కడ నెలకొంది. పెద్ద మార్కెట్‌లో పారిశుధ్యం, ఇతర సౌకర్యాలపై ఆంధ్రజ్యోతి ఫోకస్...

గుంటూరు(ఆంధ్రజ్యోతి)



మూలనపడిన ఈ టాయిలెట్

మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి మహిళ శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహణపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ నాగలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, అడిషనల్ ఎస్పీ సుప్రజలతో కలిసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ మహిళా సాధికారత, జీవనోపాధి మెరుగుదలకు ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్ర మాలతో అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయిలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని మార్చి 8వ తేదీ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ శాఖల ద్వారా మహిళ సంక్షేమం, ఆర్థిక అభి వృద్ధి కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరిస్తూ సభా ప్రాంగణంలో స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ జయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి, మహిళా అభివృద్ధి సంక్షేమ శాఖ పీడీ ఉమాదేవి, మెప్మా పీడీ విజయలక్ష్మి, బీసీ సంక్షేమశాఖ అధికారి కే మయూరి, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మహమ్మద్ షరీఫ్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి, విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ శాఖ ఏడీ సువార్త తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పిన్ పాయింట్‌గా పర్యవేక్షించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నగరంలో మెరుగైన పారిశుధ్యం కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు సకాలంలో విధులకు హాజరై పారిశుధ్య పనులను పిన్ పాయింట్‌గా పర్యవేక్షించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం పాల ఆసుపత్రి దగ్గర మస్టర్ పాయింట్, నెహ్రూనగర్, మోతీలాల్ నగర్, ఇన్నర్ రింగ్ రోడ్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే నగరంలో పర్యవేక్షణ సౌలభ్యం కోసం శానిటరీ డివిజన్ల పెంపు చేసి, పారిశుధ్య పనులకు అవసరమైన సామగ్రిని అం దించామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు ఉదయం మస్టర్‌కి సకాలంలో హాజర వ్వడం, పారిశుధ్య పనులు పక్కాగా జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం నెహ్రూనగర్, మోతీలాల్‌నగర్‌లో పర్యటించి పలు ప్రాంతాల్లో పారిశుధ్యంపై స్థానికుల నుంచి అందిన ఫిర్యాదులను నేరుగా పరిశీలించి, ప్రజారోగ్య అధికారులు మరింత బాధ్యత గా విధులు నిర్వహించాలన్నారు. పర్యటనలో కార్పొరేటర్ అయిసెట్టి కనకదుర్గ, సీఎం హెచ్‌వో డాక్టర్ అమృతం, డీఈఈ కళ్యాణరావు, ఏసీపీ రెహ్మాన్, ఆర్‌వో రవికిరణ్ రెడ్డి, ఎస్ఎస్ రాంబాబు, ఏఈలు, టీపీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించని వాణిజ్య సంస్థలు సీజ్

గుంటూరు నగరపాలక సంస్థకు సకాలంలో పన్నులు చెల్లించని కమర్షియల్ సంస్థలను సీజ్ చేయడం, నివాసాలకు ట్యాప్ కనెక్షన్లు తొలగిస్తామని, అప్పటికీ చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ ఆదేశాల మేర కు మిర్చియార్డ్, నల్లపాడు రోడ్, శ్యామలనగర్, స్తంభాలగరువు, హనుమయ్య నగర్, నల్లచెరువు, ఎల్‌ఆర్ గాంధీ నగర్, స్వర్ణాంధ్రనగర్ ప్రాంతాల్లో కమర్షియల్ సంస్థ సీజ్, ఇతర నివాసాలకు మున్సిపల్ ట్యాప్ కనెక్షన్‌ని రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ సిబ్బంది తొలగించారు.



నగర కమిషనర్ పులి శ్రీనివాసులను నగరంలోని ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలు వివరించారు. స్కూల్ బోర్డులకు ఫైన్ వేస్తున్నారని, శానిటర్ సర్టిఫికెట్స్ మంజూరులో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పాఠశాలల వద్ద వీధికుక్కల వల్ల ఎదురౌతున్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మేకల రవీంద్రబాబు, వంగా శ్రీనివా సరావు, వెలిశెట్టి వెంకటేశ్వరరావు, మురళీ, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. - గుంటూరు విద్య, (ఆంధ్రజ్యోతి)

వైభవంగా శ్రీవారి నగరోత్సవం

గుంటూరు(తూర్పు), మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మహాకుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో తపోవనం, నులకపేట శ్రీమాతా శివచైతన్య మాతాజి పర్యవేక్షణలో చండీహోమం, పూర్ణాహు తి, డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి నిర్వహణలో లలిత పారాయణ, సువాసిని సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై ఉభయదేవి సమేతుడైన స్వామి ఉత్సవమూర్తులను అంగరంగ వైభవంగా నగరోత్సవం ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాలకు సాహితీవేత్త నేరి నారాయణ మూర్తి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సభకు ఆలయ కమిటీ అధ్యక్షుడు మస్తానయ్య అధ్యక్షత వహించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య మాట్లా డుతూ నిర్మలమైన మనస్సు, నిస్వార్థమైన సేవ, మంచి ఆలోచనలతో మన ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెరుకూరి తిరుపతిరావు, స్వరూపరాణీ, వికాస్ విద్యాసంస్థల నిర్వాహకులు పీవీ శంకరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ కౌన్సిలర్లకు రెండు రోజుల శిక్షణ

గుంటూరు సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో కౌన్సిలర్లకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. గుంటూరులోని ప్రయివేటు హోటల్‌లో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఏ సిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌన్సిలర్లు నేషనల్ ఎయిడ్స్ కార్యక్రమంలో డేటా నిర్వహించే విధానాన్ని సంపూర్ణంగా తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ సరస్వతి ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

సమాజ ప్రగతికి మహిళలే చోదక శక్తి

● రోటరీ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా మాజీ గవర్నర్ రవి వడ్లమాని

గుంటూరు(విద్య), మార్చి 5(ఆంధ్రజ్యోతి): దేశ జనాభాలో సగభాగం పైగా ఉన్న మహిళలు విద్య ఉద్యోగ పారిశ్రామిక రంగాల్లో ఉన్నత స్థానాల్లో నిలదొక్కుకోవడం ద్వారా వికసిత్ భారత్ సహకారం అవుతుందని రోటరీ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా మాజీ గవర్నర్ రవి వడ్లమాని అన్నారు. స్థానిక సాంబశివపేట స్వయం పాలిత ప్రభుత్వ మహిళా కళాశాల సమావేశ మందిరంలో కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ సహకారంతో అడ్వాన్స్ సైకలాజికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఏ) ఇండియా, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ముందస్తు జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. నాగార్జున విశ్వవిద్యాలయం సైకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ టీడీ విమల మాట్లాడుతూ కళాశాల స్థాయిలో విద్యార్థినులు ప్రతిభ, జ్ఞాన నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న డాక్టర్ నీలిమ, డాక్టర్ ఎస్ హసీనా, డాక్టర్ పి.నీరజ, డాక్టర్ పి.శిరీష రాణి, డాక్టర్ షబానా అజ్మీ, కాపు శ్యామలకు ఘనంగా సత్కరించి కే. నిరంజన్ రెడ్డి మెమోరియల్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఉద్యోగినుల సాంస్కృతిక ప్రదర్శనలు

గుంటూరు(తూర్పు), మార్చి 5(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక ఎన్జీవో హోమ్ మైదానంలో మహిళా ఉద్యోగుల సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమాలకు ఏపీఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూరు షరీఫ్ ముఖ్యఅతిథులుగా హాజరైయ్యారు. మహిళా ఉద్యోగులు ప్రదర్శించిన నృత్యాలు, ఫ్యాన్సీ వస్త్ర, వేషధారణలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమాల్ని జిల్లా మహిళా ఉద్యోగ విభాగం చైర్మన్ రాధారాణి, కన్వీనర్ లక్ష్మీరమ్య, జాయింట్ సెక్రటరీ శివజ్యోతి పర్యవేక్షించారు. ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు ఈ నెల 8న కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా బహుమతు లు అందజేస్తారని అన్నారు.

వీహెచ్‌పీ మాజీ నాయకుడిపై అఘోరి ఫిర్యాదు

గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ్‌సేన నాయకుడిగా, వీహెచ్‌పీ మాజీ నాయకుడైన గుంటూరుకు చెందిన అనిల్ బెహరా అనే వ్యక్తి తనకు వీడియో కాల్ చేసి అసభ్యకరంగా దూషిస్తున్నాడని తెలుగు రాష్ట్రాల్లో వివాదాస్పదమైన వ్యక్తిగా ముద్రపడిన అఘోరి బుధవారం గుంటూరు అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనిల్ బెహరా సంగతి చూసేందుకు తాను గుంటూరు వస్తున్నానని సోషల్ మీడియాలో వీడియో విడుదల చేయడంతో అప్రమత్తమైన పోలీసులు తొలుత అఘోరిని అదుపులోకి తీసుకుని నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత ఆమెను అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు పంపడంతో అనిల్‌బెహరాపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తనను హిజ్రాగా ముద్ర వేసిన అనిల్‌బెహరా అతడి అనుచరులైన పెదకాకానికి చెందిన ఉపేంద్ర, గోపీ, రవిశంకర్, నానిలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

పశు వైద్య విద్యార్థులకు రూ.25వేల స్టైఫండ్ అందించాలి

గుంటూరు(తూర్పు), మార్చి 5(ఆంధ్రజ్యోతి): పశు వైద్య విద్యార్థులకు నెలకు రూ.25 వేల స్టైఫండ్ అందించాలని ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. కొత్తపేట మల్లయ్య లింగం భవన్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.7 వేలు, పీజీ విద్యార్థులకు రూ.9 వేలు, పీహెచ్‌డీ విద్యార్థులకు రూ.10 వేలు ఇస్తున్నారని, దీంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారని అన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు యశ్వంత్, ప్రణీత్, అజయ్, చందు, అమీర్, సాయి గణేష్, జయంత్ పాల్గొన్నారు.

హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

గుంటూరు(తూర్పు), మార్చి 5(ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లో పని చేసే హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ (ముఠా) వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సాధారణ సమావేశాన్ని బుధవారం కొత్తపేట, మల్లయ్య లింగంభవన్‌లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్న ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఇటీవల సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లో కొత్త విధానాలు ప్రవేశపెట్టి ఉపాధి లేకుండా చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, జంగాల అజయ్‌కుమార్, కోటా మాల్యాద్రి, రావుల అంజిబాబు ప్రసంగించారు.

స్కూల్ వద్ద బాణసంచా కాల్చవద్దన్నందుకు హత్యాయత్నం

గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో మందుబాబులు హల్చల్ చేశారు. స్కూల్ వద్ద బాణసంచా కాల్చవద్దు అన్నందుకు ఓ యువకుడి పై కత్తితో దాడి చేసి హత్యాయత్నం చేశారు. చుట్టుగుంట సెంటర్ వద్ద మద్యం మత్తు లో కొందరు గాజుల నాగరాజు అనే యువకుడిపై కత్తితో దాడి చేశారు. గాజుల నాగరాజు అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్కూల్ వద్ద ఉన్న ట్యూషన్ వద్ద బాంబులు కాల్చుతుంటే వద్దని నాగరాజు వారించాడు. దీంతో దుండగులు యువకుడిపై ఒక్కసారిగా కత్తితో దాడి చేశారు. గాయాలైన యువకుడిని గమనించి స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న నగరంపాలెం పోలీసులు నాగరాజు పిర్యాదు మేరకు విచారిస్తున్నారు. దాడి చేసిన మందుబాబుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఆలపాటికి విశ్రాంత పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ సన్మానం

గుంటూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను విశ్రాంత పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఘనం గా సత్కరించింది. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు వెల్లంకి లక్ష్మీనారాయణ, వైడీ నాయుడులు శాలువా, పుష్పగుచ్ఛంతో ఎమ్మెల్సీ ఆలపాటిని సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఏ రంగ ప్రసాద్ తదితరులున్నారు.

వైభవంగా స్వామి వారి కల్యాణం

గుంటూరు (తూర్పు), మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీనారాయణపురంలో కొలు వున్న శ్రీలక్ష్మీనారాయణ స్వామి వారి దేవస్థానంలో 79వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభ వంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామికి, ఉత్సవమూర్తులకు అభిషేకాలు, అలంకరణలు, పూర్ణాహుతి, విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణాలు చేశారు. సాయంత్రం అర్చకులు స్వామి వారి కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు. కల్యాణంలో దంపతులు, భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొంది తీర్థ ప్రసా దాలు స్వీకరించారు. కార్యక్రమాల్ని ఆలయ కమిటీ నిర్వాహకులు సీతారామనుజాచార్య, అనంత సత్యధర్మచార్య పర్యవేక్షించారు.

మారుతీనగర్‌లో...

గుంటూరు(తూర్పు), మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతీనగర్, శ్రీమారుతీ దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం బాల పూజ, సామూహిక తులసి పూజలు జరిగాయి. అనంతరం శ్రీమల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి శాంతి సామూహిక కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల్ని ఆలయ కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ఖాళీ స్థలాల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి



అసెంబ్లీలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఖాళీ స్థలాల విషయంలో నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. బుధవారం ఆమె అసెంబ్లీలో జీరో అవర్‌లో మాట్లాడారు. ఖాళీ స్థలాల విషయంలో తగు నిర్ణయం తీసుకొని సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ శాఖ మంత్రిని కోరారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో జనావాసాల మధ్య ఖాళీ స్థలాల నిర్వహణ లోపంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీని విషయంలో తగిన నిర్ణయం తీసుకొని, సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సినదిగా కోరారు. ఇదే విషయాన్ని గత అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తానని, ఖాళీ స్థలాల విషయంలో మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెంటనే నిర్ణయం తీసుకోవాలని ఆమె కోరారు.

మహిళ దినోత్సవం రోజున మెగా మెడికల్ క్యాంపులు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే మాధవి ఆధ్వర్యంలో మహిళా మెగా మెడికల్ క్యాంపులు ఈ నెల మార్చి 7, 8వ తేదీల్లో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహిళలు, డివిజన్ అధ్యక్షు లు, కార్పొరేటర్లతో ఎమ్మెల్యే మాధవి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా తేదీల్లో గుంటూరు జిల్లా టీడీపీ కార్యాలయం(అరండల్‌పేట)లో మహిళలకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయబోతున్నామన్నారు.

అనంతరం ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు కోసం గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి కృషి చేసిన ఎన్డీయే కూటమి నేతలందరికి ఎమ్మెల్యే మాధవి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పరిశీలకులు సింహాద్రి కనకాచారి, దాసరి జ్యోతి, మానం పద్మశ్రీ, శ్రీవల్లి, ఈరంటి వరప్రసాద్, ముత్తినేని రాజేష్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు మరింత సహకారం అందించండి

● జీరో అవర్లో ఎమ్మెల్యే నసీర్ విజ్ఞప్తి



శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు జనరల్ ఆస్పత్రి (జీజీ హెచ్)కి ప్రభుత్వం మరింత సహకారం అందించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో మంగళవారం జీరో అవర్లో గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో ఉన్న సమస్యల గురించి ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. వేలమంది ప్రజలకు ఆరోగ్యప్రదాయనిగా ఉన్న ప్రభుత్వాస్పత్రిలో ఎఫ్ఎన్‌ఎం, ఎంఎన్‌ఎంల కొరతతో రోగులు పడుతున్న ఇబ్బందులను సభ దృష్టికి తీసుకొచ్చారు. జీజీహెచ్‌కు మరింత సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని ఇంట్లో కూర్చుంటారా?!

● ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ



మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లుగా జగన్ వ్యవహారశైలి ఉంది.. ప్రతిపక్షం మాకు కాకుండా ఇంకెవరికి ఇస్తారు?' అంటూ జగన్ మీడియా ముందు మాట్లాడటం అతడిలోని అహంకారాన్ని బయటపెడుతుందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఒక ప్రకటనలో విమర్శించారు. బుధవారం మీడియాలో జగన్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. తమకు బలం లేదని, రాదని తెలిసి కూడా ప్రతిపక్ష హోదా కోరుతూ ఇంట్లో కూర్చుని ప్రెస్ మీట్‌లు పెట్టినంత మాత్రానా అబద్ధాలు నిజాలు కాలేవన్న సంగతి ఆయన తెలుసుకోవాలన్నారు. ఆనాడు టీడీపీకి 23 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు కాబట్టే సభలో ప్రతిపక్ష హోదా లభించింది. అంతేగానీ ఇందులో జగన్ దయాదాక్షిణ్యాలు ఏంలేవన్నారు. ఇప్పుడు వైసీపీకి ప్రజలు 11 సీట్లు మాత్రమే ఇచ్చారు. కనీసం 18 మంది ఎమ్మెల్యేలు లేకుండా సభలో హోదా కోరడం అత్యాశే అవుతుందన్నారు. ప్రజా తీర్పును గౌరవించి ప్రజల కోసం పోరాడాల్సిన బాధ్యత పార్టీలదని... ఆ మాత్రం జ్ఞానం జగన్‌కు లేకపోవడం బాధాకరమన్నారు. తనకు లేని అధికారాన్ని జగన్ కోరుకుంటున్నారని, ప్రజలు గౌరవం ఇవ్వకుండా ఛీ కొట్టినప్పుడు హోదా ఇవ్వాలని ఎలా కోరుకుంటారని నిలదీశారు. ఇప్పటికైనా జగన్ తన తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో ఆ పార్టీకి ఒక్కసీటు కూడా రాదని మన్నవ మోహనకృష్ణ హెచ్చరించారు.

కఠోర శ్రమతోనే ఉన్నత విజయాలు సాధ్యం

● డాక్టర్ స్వప్నశ్రీనాథ్



వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ స్వప్నశ్రీనాథ్ తదితరులు

గుంటూరు(విద్య), మార్చి 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చేసే కఠోర శ్రమతో ఉన్నత విజయాలు అందుకోవచ్చని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ స్వప్న శ్రీనాథ్ అన్నారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మంగళవారం భాష్యం విద్యాసంస్థల వార్షిక వేడు కల్లో ఆమె మాట్లాడారు. డాక్టర్ స్వప్నశ్రీనాథ్ మాట్లాడుతూ కష్టపడకుండా ఏది ఊరికే రాదని కఠోర శ్రమతోనే లక్ష్యాలను సాధించగలమన్నారు. తల్లిదండ్రులు పిల్లల మనసెరిగి ప్రవర్తించాలని సూచించారు. భాష్యం బ్రాంచి పూర్వ విద్యార్థి డాక్టర్ ప్రసన్నజ్యోతి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు వెన్నుదన్నుగా నిలిచి వారిని అన్ని విధాలా ప్రోత్సహించాలన్నారు. ముఖ్య అతిథుల చేతులమీదుగా జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతుల్ని అలరించాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా జ్ఞాపికలు అందజేశారు. కార్యక్ర మంలో గుంటూరు అర్బన్ జోన్-2 జెడ్‌వో స్వప్న, భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మస్తానయ్యకు చెక్కును అందజేస్తున్న వైద్యులు వెంకటేష్, కమలేష్, పాల్గొన్న లావు రత్తయ్య తదితరులు

శ్రీవారి ఆలయానికి రూ.10 లక్షల విరాళం

గుంటూరు (తూర్పు), మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటే శ్వర స్వామి దేవస్థానంకు ప్రముఖ బిల్డర్ పులివర్తి శేషగిరిరావు కుమారులు డాక్టర్ వెంక టేష్, డాక్టర్ కమలేష్‌లు రూ.10,10,116ల విరాళాన్ని అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షు డు చిట్టిపోతు మస్తానయ్యకు ఈ చెక్కును వారు అందజేశారు. ఈ సందర్భంగా భారీ విరాళాన్ని ఇచ్చిన శేషగిరిరావు కుమారులకు, కుటుంబసభ్యులకు మస్తానయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్ సంస్థల అధినేత లావు రత్తయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, ఆలయ కమిటీ సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడ్ మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్
గుంటూరు బ్రాంచి, డో.నెం.24-2-49, పట్నం బజార్, చావలవారి వీధి, చుండూరు ప్లాజా, గుంటూరు, ఎపి-522003, ఫోన్: 0863-2222964.
శీతల గిడ్డంగిలోని నిల్వల (ఎండుమిర్చి) అమ్మకపు వేలం వాయిదా ప్రకటన
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ది.12-02-2025 నాటి "ఆంధ్రజ్యోతి" దినపత్రికలో ప్రచురించబడిన విధంగా ది.05-03-2025న ఋణగ్రహీతలు: శ్రీ ఉప్పు నాగేశ్వరరావు (074700220103371), శ్రీ నల్లముకల శ్రీనివాసరావు (074700220103377) కి చెందిన మిర్చి బస్తాల వేలం ది.13-03-2025వ తేదీకి మార్చబడినది. మిగిలిన నియమ నిబంధనలలో ఎటువంటి మార్పు లేదు.
ప్రదేశం : గుంటూరు, తేది : 05-03-2025 సం/- అధీకృత అధికారి, తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్.


జీడిమామిడి కాయలు




జీడిమామిడి చెట్లకు పూసిన పూత, పిందె

❖ ఆశాజనకంగా పంట ❖ శాస్త్రవేత్తల సూచనలతో అధిక దిగుబడులకు అవకాశం

జీడి పండు.. పూత మెండు!


బాపట్ల పరిశోధనా స్థానంలో జీడిమామిడిచెట్లు

బాపట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అత్యధిక పోషక విలువలు కలిగి ఉండటమే కాకుండా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న జీడిమామిడి పంట ఈ ఏడాది ఆశాజనకంగా ఉంది. సకాలంలో పూత, పిందె వచ్చింది. మంచు కూడా తగ్గుముఖం పట్టడంతో పూత, పిందె నిలబడి కాయ కాస్తుంది. దీంతో ఈ ఏడాది ఆశించిన దానికంటే అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. బాపట్ల జీడిమామిడి పరిశోధన స్థానం వారు 1955 నుంచి ఇక్కడ మేలు రకాల జీడిమామిడి రకాలను రూపొందిస్తున్నారు. అఖిల భారత సమన్వయ జీడిమామిడి పరిశోధన పథకం కింద 60 ఎకరాల విస్తీర్ణంలో చెట్లు పెంచి కొత్త వైరటీలను రూపొందిస్తున్నారు. ఇప్పటి వరకు 10 రకాల జీడిమామిడి మొక్కలను తయారు చేశారు. అందులో బీపీపీ-7 మినహా బీపీపీ-1 నుంచి బీపీపీ-11 వరకు ఈ రకాలను ఆధునికీకరించారు. వీటిల్లో బీపీపీ-8,9 రకాలు అధిక దిగుబడులు ఇస్తున్నాయి. ఒక్కొక్క చెట్టు నుంచి 15 నుంచి 20 కేజీల గింజలు వస్తున్నాయి. కిలో గింజలు రూ. 120 నుంచి రూ. 150 వరకు పలుకుతుంది. 60 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జీడిమామిడి చెట్లను ప్రతి ఏడాది వేలంపాట ద్వారా రైతులకు ఇస్తుంటారు. గత ఏడాది రూ. 7.75 లక్షల ఆదాయం వచ్చినట్లు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.ఉమామహేశ్వరరావు తెలిపారు.

నివారణ చర్యలు చేపట్టాలి

ప్రస్తుతం జీడిమామిడి చెట్లలో ఆకు ముడత, ఆకుకత్తెరించే పురుగు, గూడు కట్టుట వంటివి ఆశిస్తున్నట్లు డాక్టర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. వీటి నివారణకు మోనోక్రోటోపాస్ 1.6 మిల్లిలీటర్లు లీటరు నీటికి చొప్పున కలిపి అందులో 19-19-19 రకం 5 గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేసుకొని నివారించుకోవాలని సూచించారు. పిందె దశలో ఉన్న తోటల్లో చెట్టుకు 200 లీటర్ల నీటిని అందిస్తే పిందెశాతం పెరిగి అధిక దిగుబడికి దోహదం పడుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా 1.32 లక్షల హెక్టార్లల్లో జీడిమామిడి సాగు చేస్తున్నారు. వీటి ద్వారా లక్షా 20 వేల మెట్రిక్‌టన్నుల జీడిగింజలు ఉత్పత్తి అవుతున్నాయి. రైతులు సెప్టెంబరు, అక్టోబరు నెలలో ఎరువు అందించకపోతే పూత, పిందె దశలో 19-19-19 రకం ఎరువును లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి పూత, పిందె, కాయ దశలో పిచికారి చేసుకొని దిగుబడులు సాధించవచ్చు. ఇక్కడ పెంచిన మొక్కలకు అంటుకట్టి రైతులకు జూన్ నెల నుంచి విక్రయిస్తామని శాస్త్రవేత్త ఉమామహేశ్వరరావు తెలిపారు. ప్రతి ఏడాది 40 వేల మొక్కలు ఒక్కొక్కటి రూ. 50 రూపాయల చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు.


రైతులకు విక్రయించేందుకు శాస్త్రవేత్తలు పెంచుతున్న జీడిమామిడి మొక్కలు

జీడిపండు నుంచి పౌడర్ తయారీ

-శాస్త్రవేత్త డాక్టర్ కె.ఉమామహేశ్వరరావు



జీడిగింజలే కాకుండా జీడిపండురసం నుంచి పౌడర్ తయారు చేసి ఏడాదిలో ఎప్పుడైన జ్యూస్‌గా కలుపుకొని తాగవచ్చు. జీడిపండు రసం ఎక్కువ రోజులు నిల్వ ఉండదు కనుక దీని ని అభివృద్ధి చేశాం. దీనికి పెటెంట్‌కు కూడా రానుంది. ఇప్పటికే పబ్లిష్ అయింది. ఇండియన్ పెటెంట్ కార్యాలయంలో పెటెంట్ జర్నల్స్‌లో ప్రచురించారు. పూర్తిగా గ్రాంట్ అవ్వాల్సి ఉంది. ఇది పూర్తి చేస్తే జీడిగింజలతోపాటు జీడిపండుకు కూడా డిమాండ్ వచ్చే అవకాశం ఉంది.

కొమ్మాలపాటిని..

ఎమ్మెల్సీ వరించేనా!

అధిష్ఠానం పరిశీలనలో మాజీ ఎమ్మెల్యే పేరు

ఆశావహుల్లో జంగా సహా మరికొందరు నేతలు

గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవులకు నోటిఫికేషన్ వెలువడటంతో కూటమి పార్టీలోని ఆశావహుల్లో ఆశలు చిగురించాయి. ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 20న ఎన్నికలు జరగనున్నాయి. సునాయాసంగా దక్కే ఆ పదవులను దక్కించుకునే కూటమి నేతల్లో అదృష్టవంతులెవరనే దానిపై ఊహాగానాలు జోరందుకున్నాయి. జనసేనకు ఒకటి మినహాయిస్తే మిగిలిన నాలుగు ఎమ్మెల్సీ పదవులను టీడీపీకే కేటాయించే ఉద్దేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నట్లు సమాచారం. ఆ నాలుగింటిలో ఒక పదవి కీలకమైన ఉమ్మడి గుంటూరు జిల్లాకు దక్కే అవకాశం ఉంది. ఆ స్థానాన్ని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌కు ఇచ్చే అవకాశం ఉందని ఇప్పటికే ఊహాగానాలు వెలువడ్డాయి. గత సాధారణ ఎన్నికల్లో తాను పోటీ చేయాల్సిన పెదకూరపాడు నియోజకవర్గాన్ని యువత కోటాలో భాష్యం ప్రవీణ్ పోటీ చేసే అవకాశం కల్పించి, ఆయన విజయానికి శ్రీధర్ పనిచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పర్యటనలో చంద్రబాబు సభాముఖంగా కొమ్మాలపాటికి పదవిపై హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆయనకు పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్ష పదవిని కట్టబెట్టారు. దీంతో శ్రీధర్ ఎమ్మెల్సీ పదవి రేసులో అందరికంటే ముందున్నారని చెప్పవచ్చు. గత ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ సీటును బీసీలకు ఇవ్వాలనే అధిష్ఠానం ఆలోచనతో అప్పటి వరకు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు వహిస్తున్న కోవెలమూడి రవీంద్ర(నాని) సీటును త్యాగం చేయాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం ఎమ్మెల్సీ పదవికి ఆయన పేరును కూడా అధిష్ఠానం పరిశీలించే అవకాశం ఉంది. అయితే నగరపాలక సంస్థలో టీడీపీ ఫ్లోర్‌లీడర్‌గా వ్యవహరిస్తున్న నానికి త్వరలో కూటమి వశం కానున్న మేయర్ పీఠాన్ని కట్టబెట్టాలని యువనేత నారా లోకేశ్‌తో పాటు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కూడా భావిస్తున్నారు. నానికి కూడా ఆ ఆలోచన ఉండటంతో ఏం జరుగుతుందో చూడాలి. గతంలో కూడా పార్టీ సుప్రీం చంద్రబాబునాయుడు కూడా ఒకటి రెండు సార్లు నానికి ఎమ్మెల్సీ ఇవ్వాలని ఆలోచన చేసినా చివరి నిమిషంలో సమీకరణలు మారి అవకాశం చేజారింది. ఈ పర్యాయం ఆయన మేయర్ పదవి వైపు అడుగులు వేస్తారో లేక ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తూ ఆశావహుల జాబితాలో నిలుస్తారో చూడాలి. ఇక రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దాసరి రాజా మాష్టారు కూడా ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తూ నాయకుల సిఫార్సులు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ఎన్నికల సమయంలో వైసీపీ హయాంలో తాను పొందిన ఎమ్మెల్సీ పదవిని వదులుకుని టీడీపీలో చేరిన గురజాల ప్రాంతానికి చెందిన జంగా కృష్ణమూర్తి పేరు కూడా పరిశీలన ఉన్నట్టు ఊహాగానాలు వెలువడుతున్నాయి. అయితే ఆయనకు ఇప్పటికే ఎంతో కీలకమైన తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా పదవిని కట్టబెట్టిన విషయం తెలిసిందే.


కొమ్మాలపాటి శ్రీధర్


కోవెలమూడి నాని


జంగా కృష్ణమూర్తి

వైద్య వృత్తి ప్రమాణాలను పాటించండి!

● ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి
● ఘనంగా కాటూరి వైద్య కళాశాల స్నాతకోత్సవం

గుంటూరు మెడికల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తిని సేవా నిరతితో నిర్వహిస్తామని, రోగులకు ప్రేమ, సానుభూతితో వైద్య సేవలు అందిస్తామని చేసే హిపోక్రాటిక్ ప్రమాణాలను వైద్యులు జీవితాంతం పాటించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. చినకోండ్రుపాడులోని కాటూరి వైద్య కళాశాలలో బుధవారం రాత్రి జరిగిన 2019 బ్యాచ్ వైద్య విద్యార్థుల స్నాతకోత్సవం 'సంవర్తన'లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. యువ వైద్యులకు ఎంబీబీఎస్ పట్టాలను ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడు తూ వైద్య వృత్తి క్రమేపీ వ్యాపారమయంగా మారుతున్నట్లు తెలిపారు. 'వైద్య వృత్తిలోకి ఏ స్ఫూర్తితో ప్రవేశించారో అదే స్ఫూర్తితో పేద రోగులకు వైద్య సేవలు అందించండి. చిరు నవ్వుతో రోగుల సమస్యలు వినండి, చక్కటి చికిత్సలు చేయండి. రోగుల ముఖంపై చిరునవ్వును ఆవిష్కరించండి' అంటూ సత్యకుమార్ కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించేందుకు యువ వైద్యులు ఆసక్తి చూపడం లేదని మంత్రి తెలిపారు. "ఇటీవల మెడికల్ పీజీ విద్యార్థులకు డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రామ్ కింద మూడు నెలల పాటు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసేందుకు పోస్టింగ్‌లు ఇచ్చాం. చాలా మంది పీజీలు తాము ఆయా ఆరోగ్య కేంద్రాల్లో పని చేయమని, తమ ప్రాంతంలో ఆసుపత్రిలోనే పోస్టింగ్‌లు ఇవ్వాలని నాపై పెద్దఎత్తున రాజకీయసిఫార్సులు తెస్తు న్నారు. ఈ సిఫార్సులను నేను ఆమోదించ లేదు. మూడు నెలల పాటు వైద్యులు గ్రామీణ ప్రాంతా ల్లో పని చేస్తే అక్కడి రోగుల ఇబ్బందులు తెలుస్తాయని" సత్యకుమార్ యాదవ్ తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ కింద రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలకు త్వరలో ర్యాంకింగ్‌లు ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.


వైద్య పట్టాను ప్రదానం చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రైవేటు వైద్య రంగానిది కీలక పాత్ర..

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలంటే ప్రభుత్వ వైద్య రం గంతో పాటు ప్రైవేటు వైద్య రంగం భాగస్వామ్యం అవసర మని ఆరోగ్య శాఖ మాజీ మంత్రి, కైకలూరి ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. వైద్యులు నిరంతరం విద్యార్థుల్లా ఉండాలన్నారు. రోగుల పట్ల సేవాభావంతో మెలగాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యా యని, ఇటువంటి పరిస్థితుల్లో వైద్య రంగం బలోపేతం చేసేందుకు మంత్రి సత్యకుమార్ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని కామినేని తెలిపారు. కార్యక్రమంలో కాటూరి మెడికల్ కాలేజీ చైర్మన్ కాటూరి సుబ్బారావు, జీఎస్ఎల్ గ్రూపు సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కర రావు, డాక్టర్ మాదాల శ్రీనివాసరావు, కేఎంసీ డీన్ డాక్టర్ కేఎస్ వరప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ బీ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ చల్లా మోహన్‌రావు, ఎండీ డాక్టర్ స్వైరరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేటి నుంచి గుడారాల పండుగ

దయాక్షేత్రానికి వేలాదిగా తరలివచ్చిన విశ్వాసులు

లేమల్లె ప్రాంగణంలో హోసన్న మందిరం ప్రారంభం

అమరావతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అమరావతి మండలం లేమల్లె గ్రామపరిధిలో జరిగే హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగే 48వ గుడారాల పండుగకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే ఈ పండుగకు బుధవారానికే వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా విశ్వాసులు తరలివచ్చారు. దీంతో లేమల్లె ప్రాంగణంలోని దయాక్షేత్రం కిటకిటలాడింది. గుడారాల పండుగ ప్రారంభోత్సవంలో భాగంగా బుధవారం దయాక్షేత్రంలో నూతనంగా నిర్మించిన హోసన్న మందిరాన్ని ప్రారంభించారు. చెన్నైకు చెందిన పాస్టర్ మోహన్‌సీ లాజరస్, హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్ అనిల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సౌత్‌ఆఫ్రికాకు చెందిన జాషువా మోజస్ క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు. జాన్‌వెస్లీ తదితరులు గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు రమేష్, రాజు, ఫైడిపాల్ తదితరులు పాల్గొన్నారు.


హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహంతో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

ప్రత్యేక బందోబస్తు : ఎస్పీ శ్రీనివాసరావు

గురువారం నుంచి లేమల్లె గ్రామపరిధిలో జరిగే గుడారాల పండుగ ప్రశాంత వాతావరణంలో జరిగేలా 300 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన దయాక్షేత్రం ప్రాంగణాన్ని సందర్శించి పండుగకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. స్టేజీలు, భోజనశాలలను పరిశీలించి హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, చీఫ్‌పాస్టర్ జాన్‌వెస్లీలతో పండుగ నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. దేవుని ప్రసంగాలతో పాటు విశ్వాసులలో సైబర్ నేరాల పై అవగాహన కలిగేలా సూచనలు ఇవ్వాలన్నారు. పండుగ జరిగే నాలుగు రోజులు ప్రాంగణంలో సీసీ కెమెరాలు, డ్రోన్ల సహాయంతో పర్యవేక్షణ చేస్తామన్నారు. అమరావతి- గుంటూరు రహదారిలో లేమల్లె వద్ద ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ హనుమంతరావు, సీఐ అచ్చయ్య, ఎస్ఐ అమీర్ తదితరులు ఉన్నారు.

గుడారాల పండుగకు 25 ప్రత్యేక బస్సులు

గుంటూరు: లేమల్లెలో నిర్వహిస్తున్న గుడారాల పండుగకు ఆర్టీసీ గుంటూరు-1 డిపో నుంచి 25 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం ఎమ్‌వీఎస్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్, రైల్వేస్టేషన్ల నుంచి రూ.30 చార్జీతో గుడారాల పండుగ ప్రాంగణానికి ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశామన్నారు. విశ్వాసులు ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించకుండా సురక్షితమైన ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. పండుగ ముగిసే వరకు ప్రత్యేక బస్సులను అదనపు సిబ్బందితో అందుబాటులో ఉంచుతున్నా మన్నారు.

ఉచిత విద్యుత్.. వెలుగులు



గుంటూరు (విద్య), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు విద్యుత్ వెతలు తీరనున్నాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు త్వరలో ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించనున్నారు. ఇందుకు అయ్యే వ్యయం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.175 కోట్లు కేటాయించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మండల పరిషత్, జడ్పీ, ప్రభుత్వ పాఠశాలలు దాదాపు 4500పైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 6.45 లక్షల మంది విద్యార్థులు 1 నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఆయా పాఠశాలల్లో మౌలిక వసతుల్లో విద్యుత్ కీలకం. ప్రతి స్కూల్‌లో మరుగుదొడ్లకు అవసరమైన నీటి కోసం బోరు, మంచినీటి కోసం వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. ఇంకా ప్రతి తరగతి గదిలో సగటున రెండు ఫ్యాన్లు, ట్యూబులైట్లు, డిజిటల్ ప్యానల్ బోర్డులు ఉన్నాయి. ప్రతి స్కూల్‌లోని ఆఫీసులో కంప్యూటర్స్, ప్రింటర్, జిరాక్స్ మిషన్ ఇలా అనేక విద్యుత్ ఉపకరణాలు ఉన్నాయి.


నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల

స్కూల్ గ్రాంట్ సక్రమంగా విడుదల చేయకపోవడంతో..

ప్రాథమిక పాఠశాలలకు సగటున నెలకు రూ.1000 నుంచి రూ.1500, ఉన్నత పాఠశాలలకు సగటున రూ.2 వేల నుంచి రూ.3 వేలపైన ప్రతి నెలా విద్యుత్ బిల్లు వస్తోంది. ఈ విద్యుత్ బిల్లు ఇప్పటి వరకు స్కూల్ గ్రాంట్ నుంచి చెల్లించేవారు. గత ప్రభుత్వ హయాంలో స్కూల్ గ్రాంట్ సక్రమంగా విడుదల చేయలేదు. దీంతో అనేక స్కూల్స్‌లో విద్యుత్ బిల్లులు వేలల్లో పెండింగ్ ఉన్నాయి. కొన్నిచోట్ల విద్యుత్ బిల్లులు చెల్లింపులో జాప్యం కారణంగా ఫీజులు తీసుకెళ్లడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రాంట్స్ విడుదల చేయడంతో విద్యుత్ బిల్లులు క్రమంగా చెల్లించుకుంటూ వస్తున్నారు. ఎన్నికల హామీలో భాగంగా పాఠశాలలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రకటించి బడ్జెట్‌తో నిధులు కేటాయించారు.

● ప్రాథమిక పాఠశాలకు రూ. 20 వేలు, ఉన్నత పాఠశాలకు రూ.50 వేలు
● బడ్జెట్‌లో నిధులు కేటాయింపుతో హెచ్‌ఎంల హర్షం

ప్రధానోపాధ్యాయుల హర్షం

పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించడంపై ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రతినెలా విద్యుత్ బిల్లుల చెల్లింపు కోసం తీవ్ర హైరానా పడాల్సి వచ్చేదని చెబుతున్నారు. విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఫీజులు తీసుకెళ్లేవారని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్కూల్ గ్రాంట్ నిధులు రావడంతో విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని, ఉచిత విద్యుత్ అమలు చేస్తే పాఠశాలలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ భారం నుంచి ఉపశమనం



పాఠశాలలకు ఉచిత విద్యుత్‌లో భాగంగా ప్రాథమిక పాఠశాలకు రూ.20 వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.50 వేలు వరకు ప్రభుత్వం చెల్లించనుంది. ఇందుకోసం ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. త్వరలో అన్ని ప్రభుత్వ స్కూల్స్‌కు ఉచిత విద్యుత్ పథకం అమలు కానుంది.

-తిరుమలేష్, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 98484 11050 99854 03281

పశ్చిమ డెల్టాకాల్వకు 1016 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1016 క్యూసెక్కుల సాగునీటిని బుధవారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.8 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 126, తూర్పు కాల్వకు 132, పశ్చిమకాల్వకు 95, నిజాంపట్నంకాల్వకు 65, కొమ్మమూరు కాల్వకు 613 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మంత్రి సంధ్యకు వినతిపత్రం అందజేస్తున్న జ్యోతిరాణి, వేమేశ్వరి

ప్రత్తిపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఫోరంఫర్ అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియర్ రాష్ట్ర అధ్యక్షురాలు టీ జ్యోతి రాణి శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యకి బుధవారం సచివాలయంలోని ఆమె ఛాంబర్‌లో వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీలకు గ్రాడ్యూటీ అమలు చేస్తామని ఇచ్చిన హామీకి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అనారోగ్య పరిస్థితుల్లో వేతనంతో కూడిన మెడికల్ లీవ్ అందజేయాలని, గ్రూప్ ఇన్సూరెన్సు పాలసీ వంటి పలు కోరికలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆమెతో పాటు కార్యదర్శి వేమేశ్వరి ఉన్నారు.

ఏపీఎస్పీలో మహిళా సిబ్బందికి పోటీలు



షటిల్ ఆడుతున్న కమాండెంట్ నగేష్‌బాబు

మంగళగిరి సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి ఏపీఎస్పీ ఆరో పటాలంలో పని చేస్తున్న మహిళా సిబ్బంది కి, డీపీజీ కార్యాలయంలో పనిచేస్తున్న మినిస్టర్ ఆఫ్ మహిళా సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను ఏపీఎస్పీ కమాండెంట్ కే నగేష్‌బాబు బుధవారం ప్రారంభించారు. బెటాలియన్స్ ఐజీ డీ రాజకుమారి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఆర్ఐ సింహాద్రి నాయుడు, బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

క్రైస్తవ ఉపవాస దినాలు ప్రారంభం

కాకుమాను మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పండుగ సందర్భంగా 40 రోజులపాటు క్రైస్తవులు నిర్వహించే ఉపవాస దినాలు బుధవారం నుంచి ప్రారంభమైనట్లు మండలంలోని పాస్టర్‌లు తెలిపారు. క్రైస్తవ సమాజానికి లెంటు దినాల శుభాకాంక్ష లు తెలియజేశారు. క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు ఆచరించాలని విజ్ఞప్తి చేశారు.

అవకతవకలపై విచారణ చేపట్టాలి



వెలుగు కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న డ్వాక్రా మహిళలు

పెదనందిపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పాలపర్రులో లక్ష్మీ గ్రామ సమైఖ్య గ్రూపులో నగదు లావాదేవిలకు సంబంధించి అవకతవకలు జరిగామని దీనిపై విచారణ చేపట్టాలని గ్రూపు సభ్యులు ఏపీఎం కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారితో సంబంధం లేకుండా గ్రూపు ఖాతాల్లోని నగదును తీసుకున్నారని, బదిలీ కూడా చేసుకున్నారని దీనిపై సమగ్ర విచారణ జరిపి తగు న్యాయం చేయాలని కోరారు. అనంతరం పోలీసుస్టేషన్లో కూడా ఫిర్యాదు చేసనట్లు తెలిపారు.

శ్రీవారి ఆలయానికి రూ.10 లక్షల విరాళం

గుంటూరు (తూర్పు), మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంకు ప్రముఖ బిల్డర్ పులివర్తి శేషగిరిరావు కుమారులు డాక్టర్ వెంక టేష్, డాక్టర్ కమలేష్‌లు రూ.10,10,116ల విరాళాన్ని అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్యకు ఈ చెక్కును వారు అందజేశారు. ఈ సందర్భంగా భారీ విరాళాన్ని ఇచ్చిన శేషగిరిరావు కుమారులకు, కుటుంబసభ్యులకు మస్తానయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్ సంస్థల అధినేత లావు రత్తయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, ఆలయ కమిటీ సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యాపారుల సమస్యల పరిష్కారంలో రాజీ లేదు

● చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షుడు ఆంజనేయులు

గుంటూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వ్యాపారుల సమస్యల పరిస్కారంలో ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ రాజీ లేని పోరాటం చేస్తుందని చాంబర్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు తెలిపారు. చాంబర్ ఉపాధ్యక్షుడు తడికమళ్ళ సూర్యప్రకాశరావు గతనెల 21న కన్నుమూసిన నేపథ్యంలో ఆయన సంతాప సమావేశం బుధవారం జిన్నాటవర్ సెంటర్లోని చాంబర్ కార్యాలయంలో జరిగింది.

రూ.4.82 కోట్ల విద్యుత్ బకాయిలు

● 15 గ్రామాల్లో రూ.కోట్లలో పేరుకుపోయాయి
● సర్‌చార్జ్‌ల రూపంలో పెరిగిపోతున్న బకాయిలు
● వైసీపీ ప్రభుత్వంలో కునారిల్లిన పంచాయతీలు
● రూ.కోటి 48 లక్షలు బాకీ ఉన్న కంతేరు

తాడికొండ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామ పంచాయతీలల్లో విద్యుత్ బకాయిలు చూస్తే షాక్ కొడుతున్నాయి. పంచాయతీ వీధీలైట్ల విద్యుత్‌బిల్లులు వెంటనే చెల్లించాలని విద్యుత్ అధికారులు పంచాయతీలపై ఒత్తిడి తెస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు వచ్చిన నిధులు దారి మళ్లించటంతో పంచాయతీల నిర్వహణకు డబ్బులు లేకుండా పోయింది. కార్మికులకు జీతభత్యాలు కూడా చెల్లించలేని పరిస్థితిల్లో పంచాయతీలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించటం జరుగుతుంది. ఇప్పుడిప్పుటే పంచాయతీలు సమస్యల వలయంలో నుంచి తెరుకుంటున్నాయి అయితే ఎప్పటి నుంచే విద్యుత్ బకాయిలు కొండలా పేరుకుపోతున్నాయి. దీర్ఘకాలికంగా ఉన్న బిల్లు ఎప్పుడు చెల్లిస్తారో అని అధికారులు వేచిచూస్తున్నారు. మండలంలోని 15 పంచాతీలకు గాను ఇప్పటి వరకు రూ. 4కోట్ల,82లక్షల87 వేల 726లు విద్యుత్ బకాయిలు ఉన్నాయి. పంచాయతీల్లో విద్యుత్ బకాయి పేరుకుపోవడానికి పంచాయతీల పాలనే అని తెలుస్తుంది. ప్రతి నెల బకాయిలపై విద్యుత్‌శాఖ 7 నుంచి 8 శాతం సర్‌చార్జ్ విధిస్తుంది. దీంతో లక్ష బకాయికి నెలకు ఏడువేల నుంచి ఎనిమిది వేల రూపాయలు సర్‌చార్జ్ రూపంలో పడుతుంది. ఇది కూడా బకాయిలు పేరగటానికి కారణం అవుతుంది. ఇలా సర్‌చార్జ్‌ల రూపంలో బకాయిలు పెరిగి పొవటంతో పంచాయతీలు ఏమి చేయాలేని పరిస్థితిలో ఉన్నాయి. క్రమం తప్పకుండా బకాయిలను తీర్చని పంచాయతీలకు నోటీసులు జారీ చేస్తామని తనంతరం వీధిలైట్ల కనెక్షన్స్ తొలగిస్తామని విద్యుత్ ఏ.ఈ తెలిపారు.



తాడికొండ పంచాయతీ కార్యాలయం

గ్రామ పంచాయతీల వారీగా బకాయిలు

పంచాయతీ పేరు	విద్యుత్ బకాయి
1. తాడికొండ	రూ. 20లక్షల 36 వేలు
2. పొన్నెకల్లు	రూ. 35లక్షల 02 వేలు
3. రావెల	రూ. 70లక్షల 81 వేలు
4. బండారుపల్లి	రూ. 60లక్షల 21 వేలు
5. దామరపల్లి	రూ24లక్షల 14 వేలు
6. గరికపాడు	రూ2 లక్షల 71 వేలు
7. నిడుముక్కల	రూ. 9లక్షల 49 వేలు
8.మోతడక	రూ2 లక్షల 43 వేలు
9.లచ్చన్న గుడిపూడి	రూ.16 లక్షల 60 వేలు
10. ముక్కామల	రూ.52 లక్షల 91 వేలు
11. బేజాత్పురం	రూ.12 లక్షల 59 వేలు
12. పాములపాడు	రూ.2 లక్షల 21 వేలు
13. కంతేరు	రూకోటి 48 లక్షలు
14. లాం	రూ22 లక్షల 49 వేలు
15. ఫణిధరం	రూ3 లక్షల 3 వేలు

ఆలపాటి గెలుపుపై తెలుగు తమ్ముళ్ల సంబరాలు

పెదనందిపాడు, మార్చి, 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపుపై తెలుగు తమ్ము ళ్లు సంబరాలు చేశారు. స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా గ్రామ టీడీపీ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య విద్యావంతుడైన ఆలపాటి గెలుపు కూటమి పాలనపై ప్రజల్లో ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. అత్యధిక మెజార్టీతో ఘన విజయం సాధించిన ఆలపాటికి అభినందనలు తెలిపారు. అధికారంలోకి వచ్చిన 9నెలల్లోనే ఇచ్చిన ప్రతిహామీ నెరవేరుస్తున్నారని, త్వరలో నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీడీపీ కార్యదర్శి దివ్వి నాగరాజు, నాయకులు మేడిద సుధాకర్, కట్టా మనోహర్, నూతి శ్రీనివాసరావు, వెలినేని శివయ్య, కొల్లా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హర్షం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి గెలుపుపై ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. స్థానిక అశోకా పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులకు స్వీట్లు పంచిపెట్టారు. ప్రజాసమస్యలు తెలిసిన, రైతు కుటుంబానికి చెందిన విద్యావంతుడు ఆలపాటికి పట్టభద్రులు పట్టం కట్టారన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలను పరిష్కరించగలిగిన నేత ఆలపాటి అన్నారు. కార్యక్రమంలో అశోకా పాఠశాల డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ, పోపూరి నాగేశ్వరమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 13న ధర్నా

మంగళగిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణంలో ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 13వ తేదీన ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు సీపీఎం పట్టణ కార్యదర్శి వీసం జవహర్‌లాల్ తెలిపారు. మంగళగిరి సీపీఎం కార్యాలయంలో బుధవారం జరి గిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. మంగళగిరిలో వివిధ రకాల భూముల్లో ఎన్నో సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పేదలకు పట్టాలి స్తామని ఎన్నికల ముందు మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆయా భూముల్లో ఇళ్ల పట్టాల మంజూరుకు ఉన్న అడ్డంకులను ప్రభుత్వమే తొలగించి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మించాలని, చేనేత కార్మికులకు నేతన్న నేస్తం అమలు చేయాలని, పట్టణంలో పేరుకుపోయిన మురుగు, చెత్తను తొలగించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని, అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నేతలు చెంగయ్య, రాఘవులు, బాలాజీ, పిల్లలమర్రి బాలకృష్ణ, ఎం చలపతిరావు, ఎం నాగేశ్వరరావు, కే శ్రీనివాసరావు, బ్రాహ్మణి, గణేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లకు మరమ్మతులు చేయించాలి

● హైకోర్టు న్యాయవాది చిలువూరు నాగరాజు

మంగళగిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల ద్వారా దశాబ్దాల కింద నిర్మించుకున్న పేదల పక్కా గృహాలు శిథిలావస్థకు చేరాయని, ఆయా గృహాలకు మరమ్మతులు చేయించాలని హైకోర్టు న్యాయవాది చిలువూరు నాగరాజు కోరారు. ఈ మేరకు బుధవారం దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామస్థులతో కలిసి తాడేపల్లిలో ఏపీ ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో దశాబ్దాల కిందట నిర్మించుకున్న శాశ్వత పక్కా గృహాలు శిథిలావస్థకు చేరాయని, శ్లాబులు, గోడలు పెచ్చులూడి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నా యని చెప్పారు. ఆర్థికంగా బలహీనులైన పేదలు మరమ్మతులు చేయించుకోలేక బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారని, ప్రభుత్వం స్పందించి సదరు గృహాలకు మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యను మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ చెర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నేత నలుకుర్తి కోటేశ్వరరావు, కాసుకుర్తి నవీన్, కుక్కమళ్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విప్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాగరాజు తదితరులు

కాజలో సంజీవని ఆరోగ్య శిబిరం



సంజీవని వైద్యశిబిరంలో పాల్గొన్న సిబ్బంది, గ్రామస్థులు

మంగళగిరి సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో నిర్వహిస్తున్న సంజీవని ఆరోగ్య సంచార రథం ద్వారా మండలంలోని కాజ గ్రామంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామస్థులకు వైద్యసేవలు అందించారు. 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి, గ్రామ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, జనసేన అధ్యక్షుడు అప్పికట్ల వెంకటరత్నం నాయుడు, బోనం రాఘవరావు, కూరాకుల బాపయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఆటల పోటీలు ప్రారంభం



ఆటల పోటీల్లో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కాకుమాను, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కాకుమాను ఎస్టీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీలకు క్రీడా పోటీలు కాకుమాను సెక్టార్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ వెంకాయమ్మ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వెంకాయమ్మ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 8న జరిగే మహిళ దినోత్సవం రోజున బహుమతుల ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు ఝాన్సీరాణి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ప్రత్తిపాడు ఆధ్వర్యంలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 8న మహిళా దినోత్సవం నాడు బహుమతులు అందజేస్తామన్నారు. తొలుత జిల్లా పరిషత్ పాఠశాలలో కిశోర బాలికలకు యోగాపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీదుర్గా, మహిళా పోలీసు బిందుమాధవి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

● జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి పద్మ



ఎండీఎం వాహనంలో తూకాలను, రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి పద్మ

పెదనందిపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అవకతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి పద్మ అన్నారు. మండలపరిధిలోని వరగాని, పెదనందిడులోని 14, 15నెంబర్ రేషన్ దుకాణాలు. 3వ నెంబర్ ఎండీఎం వాహనం, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్, గ్యాస్ ఏజెన్సీలను బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులను, స్టాకు నిల్వల వ్యత్యాసాలను పరిశీలించారు. పెట్రోల్ బంక్, గ్యాస్ ఏజెన్సీస్ వారు వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించరాదని, సరైన వసతులు కల్పించాలని డీలర్లకు సూచించారు. ఎండీఎం వాహనదారులు లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసినట్లయితే వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆమెవెంట ఆర్ఐ సాహితీమోహన్ ఉన్నారు.

రాజధాని నిర్మాణానికి ప్రజలపై భారం వేయం

● రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ

నెల్లూరు (హరనాథపురం), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి పెడుతున్న ఖర్చులో ఒక్కపైసా కూడా ప్రజలపై భారం వేయడం లేదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. బుధవారం నెల్లూరులోని కలెక్టర్ తిక్కన భవన్‌లో కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌తో కలిసి అధికారులతో మంత్రి సమీక్షించారు. అనంతరం నారాయణ విలేకరులతో మాట్లాడుతూ.. రాజధాని నిర్మాణానికి సేకరించిన 5 వేల ఎకరాల్లో సుమారు 1,200 ఎకరాలను అంతర్జాతీయ, జాతీయ స్థాయి విద్యాసంస్థలు, పాఠశాలలు, పరిశ్రమలు నెలకొల్పేందుకు కేటాయించినట్లు చెప్పారు. మిగిలిన భూమిలో అన్ని వసతులు కల్పించి మంచి ధరకు విక్రయించి ఆ డబ్బునే రాజధాని నిర్మాణానికి వినియోగించేలా, రాజధానికి చేసిన అప్పులు తీర్చేలా సీఎం చంద్రబాబు ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. రాజధాని నిర్మాణానికి రూ.64 వేల కోట్లకు పరిపాలనా ఆమోదం లభించగా, రూ.50 వేల కోట్లకు అధికారులు టెండర్లు పిలిచినట్లు చెప్పారు. హడ్కో, ఎడీబీ బ్యాంకు, ప్రపంచ బ్యాంకు నిధులను సమీకరిస్తూ రాజధాని నిర్మాణానికి ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. బడ్జెట్‌లో రాజధానికి రూ.6వేల కోట్ల కేటాయించామని, ఇంకా అవసరమైతే ఇస్తా మని సీఎం చెప్పారని చెప్పారు. రాజధాని విషయంలో ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దని ప్రజలకు సూచించారు. రాజధాని ప్రాంతంలో జడ్జీలకు నిర్మిస్తున్న భవనాలకు చదరపు అడుగుకు ఒక పత్రికలో రూ.10వేలు ఖర్చు చేస్తున్నట్లు ప్రచురించారని, అది వాస్తవం కాదని అన్నారు.

పగుళ్లిచ్చిన ఎంపీడీవో ఆఫీసు గోడలు



గోడలపై రావి చెట్టు మొలవటంతో పగుళ్లు ఏర్పడిన తుళ్లూరు ఎంపీడీవో కార్యాలయం

తుళ్లూరు, మార్చి (ఆంధ్రజ్యోతి): పగుళ్లిచ్చిన గోడలతో ఎంపీడీవో ఆఫీసు దర్శనమిస్తుంది. అనేక చోట్ల గోడల్లో రావి చెట్లు మొలిచి పగుళ్లొస్తున్నాయి. ఎప్పటికప్పుడు రిపేర్లు చేపిస్తే బాగుండేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీ నిధులు, పంచాయతీ రాజ్ నిధులు పక్కదారి పట్టించారు. కార్యాలయాలకు రిపేరు చేద్దామన్నా పైసా లేదనే వాళ్లు. గోడలకు క్రాక్‌లు వస్తున్నా.. పట్టించుకోకపోవటంతో, శిథిలావస్థకు చేరే అవకాశం ఉందని వివిధ పనుల మీద వచ్చే ప్రజానికం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా రిపే ర్లు చేయాలని కోరుతున్నారు.

మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్

గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారు లు సమన్వయంతో పకడ్బందీ ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి మహిళ శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహణపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ మహిళా సాధికారత, జీవనోపాధి మెరుగుదలకు ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలతో అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయిలో మహిళ దినోత్సవాన్ని మార్చి 8వ తేదీ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

తారురోడ్డు నిర్మాణంతో తొలగిన అవస్థలు



నిర్మాణానికి ముందు, తర్వాత శృంగారపురం రోడ్డు

దుగ్గిరాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రేవేంద్రపాడు నుంచి శృంగారపురం వరకూ గుంతలమయమై అధ్వానంగా మారిన రోడ్డుతో పడిన అవస్థలు ఎట్టకేలకు తొలగిపోయాయని శృంగారపురం గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రేపల్లె కాల్వపై వంతెన ఎక్కేందుకు ద్విచక్రవాహనదారులు పలుమార్లు ప్రమాదాల బారిన పడుతూ వచ్చారు. ఆరేళ్లుగా కనీస మరమ్మతులకు కూడా నోచుకోక, గ్రామంలోకి ఆటోలు కూడా వచ్చేందుకు వీల్లేని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుత విద్య, ఐటీ, మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, తన ఎన్నికల ప్రచారంలో యిచ్చిన హామీని నిలబెట్టుకున్నారంటూ గ్రామస్థులు, లోకేశ్‌కు, టీడీపీ నాయకులకు కృతజ్ఞులు తెలియజేస్తున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

● విజేతగా నిలిచిన మోరంపూడి సురేష్ జట్టు



వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతిని అందిస్తున్న గొర్నెని అనిల్, సర్పంచ్ ఇత్తడి రమేష్, శ్రీనివాసశర్మ, చంటి తదితరులు

దుగ్గిరాల(మోరంపూడి), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మోరంపూడిలో జరుగుతున్న రాష్ట్రస్థాయి వాలీబాల్‌టోర్నీలో మోరంపూడి సురేష్‌జట్టు, బాబూ జగ్జీవన్ రామ్ జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన పోటీలు ఫైనల్స్‌తో ముగిశాయి. ఈ నెల 1వతేదీ నుంచి గ్రామ పంచాయతీ సమీపంలో ఫ్లడ్‌లైట్ల మధ్య నాలుగు రోజులపాటు జరిగిన వాలీబాల్ పోటీల్లో మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఫైనల్స్‌లో మోరంపూడి సురేష్‌జట్టు విజేతగా నిలిచింది. దుగ్గిరాల సాగునీటి డీసీ చైర్మన్ గొర్నెని అనిల్ ప్రారంభించిన టోర్నీలో మొత్తం 25జట్లు పోటీలో పాల్గొన్నాయి. డీసీసీ చైర్మన్ అనిల్, దుగ్గిరాల పసుపు మార్కెట్‌యార్డు మాజీచైర్మన్ కొండూరు ముత్తయ్య, సర్పంచ్ ఇత్తడి రమేష్, కొలకలూరి శ్రీనివాసశర్మ, ఇత్తడి చంటి తదితరుల చేతులమీదుగా ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 20,116, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15,116, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10,116లు అందించారు.

చేనేతలను మభ్యపెడుతున్న కూటమి ప్రభుత్వం

మంగళగిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): చేనేతలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం మభ్యపెడుతుందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ బాలకృష్ణ అన్నారు. మంగళగిరి సీపీఎం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం కంటే చంద్రబాబు ప్రభుత్వం చేనేతను ఎక్కువగా ఆదుకుందని మంత్రి సవిత శాసన మండలిలో మాట్లాడడం సరికాదన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు కోసం చేనేత కార్మికులు దరఖాస్తులు చేసుకుని విద్యుత్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. శాసనమండలిలో ఉచిత విద్యుత్తు ఇచ్చినట్టుగా మంత్రి సవిత మాట్లాడడం చేనేతలను మోసం చేయడమేనని విమర్శించారు. అలాగే చేనేత ఎగ్జిబిషన్లలో 80 శాతం పవర్‌లూమ్ వస్త్రాలను విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. చేనేత సహకార సంఘాలకు చెల్లించవలసిన రూ.156 కోట్ల పావలా వడ్డీ, యార్న్ సబ్సిడీ, రిబేటు బకాయిలు చెల్లించకపోవడంతో సహకార సంఘాల్లో పనిచేస్తున్న కార్మికులు పనుల్లేక ఇతర వృత్తుల వైపు మళ్లుతున్నారని చెప్పారు. ప్రభుత్వం చేనేతలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సీఆర్డీఏ కార్యాలయంలో భద్రతపై అవగాహన తరగతులు

తుళ్లూరు, మార్చి 5(ఆంధ్రజజ్యోతి): తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం రెండో రోజు అవగాహన తరగతులు నిర్వహించారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రాథమిక చికిత్స ఎలా చేయాలి అనే అంశంపై గుంటూరు డీపీఎంవో డాక్టర్ సీహెచ్ రత్నమోహన్ అవగాహన కల్పించారు. సీపీఆర్ మీద డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసన్ విభాగం డాక్టర్ రాధికారాణి చంద్ర అవగాహన కల్పించారు. తుళ్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి దాసరి శ్రీనివాసరావు, వసుంధర, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

విద్య ప్రాధాన్యంపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, విద్యార్థులు

మంగళగిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి టిప్పర్ల బజారులోని కాంద్రకమల మున్సిపల్ హైస్కూల్లో బుధవారం బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. విద్య ప్రాధాన్యం, బాల్య వివాహాల నిర్మూలన, బాలల హక్కులపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ దరియావలి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వయోగి విశ్వంజీ జన్మదిన వేడుకలు



నడింపాలెం పంచాయతీకి చెత్తను తరలించేందుకు మూడు చక్రాల రిక్షాను అందజేస్తున్న విశ్వయోగి విశ్వంజీ

ప్రత్తిపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ జన్మదిన వేడుకలు కొండ్రుపాడు విశ్వనగర్‌లో ఘనంగా జరిగాయి. ఐదు రోజులుగా విశ్వనగర్‌లో జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నారు. చివరి రోజైన బుధవారం విశ్వయోగి విశ్వంజీ వేలాది మంది భక్తుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా విశ్వశాంతి, లోక కల్యాణం కోసం ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నడింపాలెం పంచాయతీకి పారిశుధ్య పనుల కోసం రిక్షాను విశ్వయోగి విశ్వంజీ అందజేశారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227 99854 02292

ట్రాక్టర్లకు టేప్ రికార్డర్లు పెడితే చర్యలు

ఎస్ఐ కోటేశ్వరరావు



టేప్ రికార్డు బాక్సులను ట్రాక్టర్‌తో తొక్కిస్తున్న పోలీసులు

కొల్లిపర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్లకు టేప్ రికార్డులు పెడితే తగిన చర్యలు తీసుకోనున్నట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, తూములూరు గ్రామాల్లో ఎస్ఐ తన సిబ్బందితో వాహనాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ ట్రాక్టర్లకు టేప్ రికార్డులు ఏర్పాటుచేయడం వలన ప్రజలకు అసౌకర్యంగా ఉందన్నారు. విపరీతంగా లౌడ్‌స్పీకర్లు పెట్టి ట్రాక్టర్లను నడిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. వాహనాలు నడిపే వారికి తప్పనిసరిగా లైసెన్సు ఉండాలన్నారు. అనంతరం ట్రాక్టర్లకు ఏర్పాటుచేసిన టేప్ రికార్డుల బాక్సులను తీయించి ట్రాక్టర్‌తో ధ్వంసం చేయించారు.

ఆలపాటి ఘన విజయంపై పలువురి హర్షం

తెనాలి రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘన విజయం సాధించటంపై తెనాలి నియోజవర్గం నుంచి బుధవారం పెద్దసంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీగా గెలుపొందిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను బుధవారం గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ నేత వీరవల్లి మురళి, అంగలకుదురు ఉపసర్పంచ్, టీడీపీ నేత కనగాల నాగభూషణం, రాష్ట్ర వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి ఈదర వెంకట పూర్ణచంద్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ కేసన కోటేశ్వరరావు, తెనాలి నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు కలిసి దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి

● వడ్రాణం మార్కండేయబాబు

పొన్నూరు టౌన్ మార్చి 5(ఆంధ్రజ్యోతి): మార్చి 14న పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని పార్టీ సమన్వయ కర్త వడ్రాణం మార్కండేయబాబు కోరారు. బుధవారం పట్టణంలోని జనసేన కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మార్కండేయబాబు మాట్లాడుతూ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు పొన్నూరు నియోజకవర్గం నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యవర్గ సభ్యుడు తాళ్లూరి అప్పారావు, దేశంశెట్టి సూర్య, చేబ్రోలు మండల అధ్యక్షుడు చందు శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు ఆటల పోటీలు

తెనాలి రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని డ్వాక్రా మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. బుధవారం మండలంలోని కొలకలూరులోని హైస్కూల్ గ్రౌండ్‌లో డ్వాక్రా ఏపీఎం జయశ్రీ పర్యవేక్షణలో పలు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్కూల్ ఉపాధ్యాయులు, పలువురు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

తెనాలి అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కాల్వ కట్టలపై నివసిస్తున్న పేదలకు బుధవారం బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు. ఫర్ ద లీస్ట్ ఆఫ్ ట్రైబల్ మినిస్ట్రీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సినీ దర్శకుడు దిలీప్‌రాజా, అంజలి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ ఉపవాస దినాలు ప్రారంభం

పొన్నూరు టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పండుగ సందర్భంగా 40 రోజుల పాటు క్రైస్తవ సోదరులు నిర్వహించే ఉపవాస దినాలు బుధవారం నుంచి ప్రారంభం అయినట్లు జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ చైర్మన్ జోసెఫ్ మోసిగంటి బుధవారం తెలిపారు. ఉపవాస దీక్షల ద్వారా తమను తాము పరీక్షించుకుని తమ పాపాల కోసం యేసు ప్రభువు భరించిన శ్రమలను గుర్తు చేసుకుని ఈ ఉపవాస దీక్షలను ఆచారిస్తారన్నారు. క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు ఆచరించాలని విజ్ఞప్తి చేశారు.



యాంటీ రాబిస్ ఇంజక్షన్ వేయించుకుంటున్న చిన్నారులు, కుక్కకాటుతో వైద్యసేవలకు వచ్చిన చిన్నారి



వీధుల వెంట బారులు తీరిన కుక్కల సమూహం

పెరుగుతున్న కుక్క కాటు కేసులు

● నియంత్రణ చర్యలు శూన్యం
● నిత్యం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు బాధితులు
● బాధితుల్లో ఎక్కువగా చిన్నారులు
● కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి

తెనాలి రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు రోజు రోజుకి కుక్కకాటు కేసులు పెరుగుతున్నాయి. ఎక్కువగా చిన్నారులపైనే దాడిచేయడం ఆందోళన కలిగిస్తోంది. ఇంటి నుంచి స్కూల్స్‌కు, ఆటలాడుకునేందుకు చిన్నారులు వీధుల వెంట నడిచి వెళ్లే క్రమంలో గుంపులుగా కుక్కలు దాడి చేస్తుండటంతో ఇటు తల్లిదండ్రులు, అటు స్థానికులు సైతం భయాందోళనకు గురవుతున్నారు. చిన్నారులు ఆసుపత్రిలో ఇంజక్షన్ చేయించుకునే సమయంలో తల్లిదండ్రులు మనోవేదన వర్ణనాతీతంగా ఉంటున్నది. ఒక్కసారి కుక్కకాటుకు గురైతే దాదాపుగా ఐదు డోస్‌లు ఇంజక్షన్లు చేయించుకోవాల్సి ఉంటుంది. దీంతో చిన్నారులు, తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో వీధికుక్కలకు శస్త్ర చికిత్సలు చేసి సంతతిని తగ్గించేలా చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి ఉత్పన్నమైందని పలువురు ఆరోపిస్తున్నారు. ఐదేళ్ల క్రితం తెనాలి పట్టణ, మండల గ్రామాల్లో వీధుల్లో అడపా దడపా కుక్కలు ఉండేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వాటిపై దృష్టి పెట్టకపోవడంతో సంతతి పెరిగి ఏ వీధి చూసినా కుక్కల మందలతో దర్శనమిస్తున్నాయి. ఫలితంగా కుక్కలు ప్రజలపై దాడులు చేస్తూ తీవ్రంగా గాయపరుస్తున్నాయి. రాత్రి వేళల్లో ద్విచక్రవాహనాలను సైతం వెంబడిస్తుండటంతో పలువురు వాటి బారి నుంచి తప్పించుకునే క్రమంలో వాహనాలు అదుపు తప్పి కిందపడి గాయపడిన ఘటనలు కూడా ఉన్నాయి. ఇటీవల కుక్కలకు చర్మవ్యాధులు సోకుతుండటంతో అవి జుట్టు రాలి కళావిహీనంగా మారి ఒంటి నిండా రక్తపు చారలతో దద్దుర్లు ఏర్పడి దర్శనమిస్తున్నాయి. అవి మిగతా కుక్కలతో తిరుగుతుండటంతో రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న కుక్కలకు ఆ వ్యాధి సోకుతుంది. వీటికి వైద్యసేవలు చేయించేందుకు ఎవ్వరూ సాహసించని పరిస్థితి. ఈ అనారోగ్య సమస్యలున్న కుక్కలు కరిస్తే మరింత ప్రమాదమేనని పులువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం పట్టణ, మండల గ్రామాల్లోని కుక్కల నియంత్రణకు తక్షణ చర్యలకు ప్రణాళికతో ముందుకు సాగాలని పలువురు కోరుతున్నారు.



సీసీ కెమెరాల ఏర్పాటుపై చర్చిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

● డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన మార్గాలలో ఉన్న షాపుల యజమానులు తప్పనిసరిగా తమ షాపులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ జనార్ధనరావు సూచించారు. బుధవారం ప్రధాన రోడ్లలోని షాపుల యజమానులతో సమావేశాలు జరిపి సీసీ కెమెరాల ఏర్పాటు పెద్ద ఆర్థిక భారం కాదన్నారు. దీనివలన షాపులలో జరిగే దొంగతనాలను రోడ్డుపై ఏర్పడే ప్రమాదాలు, ఇతర నేరాలను గుర్తించడానికి తోడ్పడుతుందని వారికి వివరించారు. వ్యాపారవర్గాలు సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. వీరి వెంట వన్ టౌన్ సీఐ మల్లికార్జునరావు, సిబ్బంది ఉన్నారు.



పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్, సీఐ

ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో అధికారుల తనిఖీ

తెనాలి అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను బుధవారం అధికారులు తనిఖీ చేశారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, టూ టౌన్ సీఐ రాములునాయక్, ఎస్ఐ బాబురావులు తనిఖీల్లో పాల్గొన్నారు. నాజరుపేట వివేకా జూనియర్ కళాశాల, విశ్వ జూనియర్ కళాశాల, కేకేఆర్ గౌతమ్ స్కూల్, నారాయణ కళాశాలల్లో నడుస్తున్న ఇంటర్ పరీక్షలను పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా పరీక్షలు జరుగుతున్నాయా లేదా అని తనిఖీ చేశారు. కేంద్రాల్లో ఎంతమంది విద్యార్థులను కేటాయించింది, హాజరును చీఫ్ సూపరింటెండెంట్ అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించండి

● మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి మారీసుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న శానిటేషన్ సిబ్బందికి సూచించారు. బుధవారం మారీసుపేట చంద్రబాబు నాయుడు కాలనీలో జరుగుతున్న పారిశుధ్య పనులను పురపాలక సంఘ కమిషనర్ శేషన్న క్షేత్రస్థాయిలో అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ శానిటేషన్ సిబ్బందిని డ్రెయిన్లలోని మురుగును, రోడ్లపై వ్యర్థాలను పూర్తి తొలగించి డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పన్నులను సకాలంలో చెల్లించండి: కమిషనర్

పురపాలక సంఘం పన్నులను సకాలంలో చెల్లించాలని మునిసిపల్ కమిషనర్ శేషన్న అన్నారు. బుధవారం మారీసుపేట ఆర్ఆర్ కాలనీలోని షాపులను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఇంటి, ఖాళీ స్థలాల, నీటి పన్నులను నిర్ణీత గడువులోపు చెల్లించాలన్నారు. షాపుల నిర్వాహకులు తమ షాపుల ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోవాలని నూతనంగా వ్యాపారాలను నిర్వహించేవారు ట్రేడ్ లైసెన్స్‌లను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పురపాలక సంఘం నిబంధలను అతిక్రమించిన వారికి మునిసిపల్ చట్టం ప్రకారం జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. సకాలంలో పన్నులను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ట్రేడ్ లైసెన్స్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ శేషన్న, అధికారులు

వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



ప్రమాదాల్లో మృతిచెందిన వారు

తెనాలి క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మృతి చెందిన సంఘటన బుధవారం తెనాలి రైల్వే స్టేషన్ వద్ద జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని 60 సంవత్సరాల వృద్ధురాలు 3వ నెంబరు ప్లాట్‌ఫాంపై ఎదురుగా వస్తున్న రైలును గుర్తించకుండా 4వ నెంబరు ప్లాట్‌ఫారం మీదుకు వెళుతుండగా రైలు ఢీకొని మృతి చెందింది. మరో సంఘటనలో స్టేషన్ సమీపంలోని యడ్లలింగయ్య కాలనీ ఎదురుగా తిరుపతి-విశాఖ తిరుమల ఎక్స్‌ప్రెస్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి 50సంవత్సరాల వ్యక్తి జారి పడి మృతి చెందాడు. ఈ సంఘటనల్లో మృతుల వ్యక్తిగత వివరాలు లభించకపోవడంతో కేసు నమోదుచేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

సాక్షి భావన్నారాయణ స్వామి ఆలయంలో...

ఆరోపణలపై విచారణ



విచారణ నిర్వహిస్తున్న దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి

పొన్నూరు టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని సాక్షి భావన్నారాయణ స్వామి ఆలయంలో పూజలకు వినియోగించే రాగి, ఇత్తడి, స్టీల్, సామగ్రి అనుమతిలేకుండా బయటకు తరలించారని వచ్చిన ఆరోపణలపై బుధవారం విచారణ జరిగింది. కొద్దిరోజుల క్రితం ప్రత్యేక పూజలకు వినియోగించే పాత్రలు, ఆలయ అధికారుల అనుమతి లేకుండా కొందరు వ్యక్తులు ఆలయం వెలుపలకు తరలించుకుపోయారని ఆలయ అధికారులకు ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదు అందుకున్న ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరెడ్డి బుధవారం ఆలయానికి విచ్చేసి అర్చకులు, సిబ్బందిని పిలిపించి విచారణ చేశారు. అంతే కాకుండా పాత్రల తరలింపుచేసిన వ్యక్తులను గుర్తించేందుకు ఆలయంలోని సీసీ టీవీలను పరిశీలించారు. సీసీ టీవీ రికార్డులను పరిశీలించి పాత్రలు అనుమతి లేకుండా తరలించుకుపోయిన వారిని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఏసీ తెలిపారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

విగ్రహాలకు తొలగని ముసుగులు



లక్ష్మీడీలక్స్ వద్ద ముసుగుతో ఉన్న ఆలపాటి ధర్మారావు విగ్రహం

తెనాలి క్రైం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌లో భాగంగా పట్టణంలో వివిధ రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు మునిసిపల్ అధికారులు ముసుగులు వేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చా యి. ఎన్నికల కోడ్ ముగిసింది. అయినా మునిసిపల్ అధికారులు మాత్రం విగ్రహాల ముసుగులు మాత్రం తొలగించలేదు. కోడ్ ముగియగానే సంబంధిత అధికారులు సత్వరమే చర్యలు చేపట్టకపోవటంపై ప లువురు విమర్శిస్తున్నారు.

మహిళా సాధికారత కోసం పోరాటం

● ఆంధ్రప్రదేశ్ మహిళ సమాఖ్య జిల్లా కార్యవర్గ సభ్యురాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

పొన్నూరు టౌన్; మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మహిళ సాధికారత సాధించే దిశగా పోరాటం చేద్దామని ఆంధ్రప్రదేశ్ మహిళ సమాఖ్య జిల్లా కార్యవర్గ సభ్యురాలు అంగలకుదురు దుర్గా భవాని అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం మహిళ దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దుర్గాభవాని మాట్లాడుతూ ఈ నెల 8న గుంటూరు సీపీఐ కార్యాలయం వద్ద అంతర్జాతీయ మహిళ దినోత్సవ సదస్సు జరుగుతుందన్నారు. మహిళలు గౌరవప్రదంగా జీవించే హక్కుల కోసం పోరాడనున్నట్లు చెప్పారు. ఈ సదస్సు ద్వారా దిశా నిర్దేశం చేయనున్నట్లు చెప్పారు. సదస్సును విజయవంతం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మహిళ సమాఖ్య సభ్యులు వెంకటేశ్వరమ్మ, దేవరకొండ తిరపతమ్మ, కృష్ణవేణి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● మండల వైద్యాధికారి సుమంత్



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న మండల వైద్యాధికారి సుమంత్

కొల్లిపర, మార్చి 5(ఆంధ్ర జ్యోతి): గ్రామీణప్రాంతాల్లో ఏర్పాటుచేస్తున్న మెడికల్ క్యాంపులను పేదలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి సుమంత్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వల్లభాపురంలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ మెడికల్ క్యాంపు ఏర్పాటుచేయడం వలన దీర్ఘకాలిక రోగాలను గుర్తించవచ్చన్నారు. ప్రతి నెల నిర్వహించే ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్లి వైద్య సదుపాయం కల్పించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సరళ, ఏఎన్ఎం యామిని, హెల్త్ అసిస్టెంట్ మల్లేశ్వరరావు, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు శాంతి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న తదితరులు

పరీక్షల్లో అత్యున్నత ఫలితాలు సాధించాలి

● విద్యార్థులతో మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి మారీసుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు అత్యున్నత ఫలితాలు సాధించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. బుధవారం స్థానిక మారీసుపేటలోని ఎన్‌సీఆర్ఎం హెచ్ స్కూల్‌లో పురపాలక సంఘం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కమిషనర్ బండి శేషన్నతో కలసి పదో తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పబ్లిక్ పరీక్షలలో మెళకువలు పాటించి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, వైస్‌చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, నాగవేణి, కౌన్సిలర్లు దేసు యుగంధర్, అన్నం పిన్నారావు, తాడిబోయిన బ్రహ్మేశ్వరావు, మానసరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పురపాలక సంఘంలో దస్త్రాల తనిఖీ



దస్త్రాలను తనిఖీ చేస్తున్న ఏఎవో రాజమల్లేశ్వరరావు తదితరులు

తెనాలి మారీసుపేట, మార్చి 05 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలో దస్త్రాల తనిఖీని స్టేట్ ఆడిట్ అధికారులు చేపట్టారు. బుధవారం పురపాలక సంఘంలో ఏఎవో రాజమల్లేశ్వరావు అన్ని విభాగాల దస్త్రాల తనిఖీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు అన్ని విభాగాల దస్త్రాలను పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీవీఐటీ కళాశాలను సందర్శించిన కెనడా మంత్రి

పెదకాకాని, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో ద్వైపాక్షిక సంబంధాల కోసం రాష్ట్రంలో పర్యటిస్తున్న న్యూఢిల్లీలోని కెనడా హైకమిషన్ మంత్రి (వాణిజ్య వ్యవహారాలు) రయాన్ వార్డ్, హైదరాబాద్లోని కెనడా ట్రేడ్ కమిషనర్ విక్రమ్ జైన్తో కలసి వీవీఐటీ కళాశాలను బుధవారం సందర్శించారు. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్‌లతో కలిసి కళాశాలలోని మౌలిక వసతులు, సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, గూగుల్ కోడ్ ల్యాబ్‌లను వీక్షించి అనంతరం విద్యార్థులకు కెనడాలో ఉన్న విద్యా, ఉపాధి అవకాశాలపై చర్చించారు. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు కెనడాలో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని, డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాం, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్‌తోపాటుగా ఉపాధితో కూడిన ఉన్నత విద్యను అందించేందుకు, విద్యార్థులకు భారతదేశం, కెనడాల మధ్య పరిశోధన కార్యకలాపాలను రూపొందించేరుకు వీలుపడేలా కెనడా మంత్రితో చర్చించినట్లు తెలిపారు.



కెనడా మంత్రితో వీవీఐటీ అధ్యాపకులు

భక్తిశ్రద్ధలతో వేణుగోపాలస్వామి కల్యాణం

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శలపాడులోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి మూలవిరాట్‌లతో పాటు ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. రాత్రికి ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై స్వామివార్ల ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి కల్యాణ మహోత్సవం నయనానందకరంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. కల్యాణ పూజలలో ఆలయ ఈవో పోతుల రామకోటేశ్వరరావు, అర్చక స్వాములు గంజాం సత్యనారాయణాచార్యులు, మహేంద్ర బాబు, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

